ఆంధ్రజ్యోతి

andhrajyothy.com బుధవారం ఉష్ణోగ్రత గరిష్ఠం 37.4 : కనిష్ఠం 25.2



బోరుమంటున్న సాగు



- జిల్లాలో అడుగంటుతున్న భూగర్భ జలాలు
- బోరు బావుల కింద సాగుకు కష్ట కాలం
- అయోమయంలో 70వేల అగ్రి కనెక్షన్‌దారులు
- ఆందోళనలో రైతులు

నిర్మల్, మే 7 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో బోరు బావుల కింద పంటలు సాగుచేస్తున్న రైతులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. జిల్లావ్యాప్తంగా భూగర్భ జలాల మట్టం గణనీయంగా తగ్గుముఖం పడుతుండడంతో యాసంగి పంటల పరిస్థితి అయోమయంగా మారుతుందంటున్నారు. సాగుకోసం జిల్లావ్యాప్తంగా 70 వేలకు పైగా వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు ఉన్నట్లు అధికారులు పేర్కొంటున్నారు. ఈ వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లతో బోరు బావుల ద్వారా రైతులు తమ పంటలకు సాగు నీరందిస్తున్నారు. ముఖ్యంగా ఇక్కడి యాసంగి పంటలకు బోరు బావుల నీరే శరణ్యమవుతోంది. ఖరీఫ్ పంటలకు కూడా చివరి సమయంలో బోరు బావులే దిక్కవుతున్నాయి. బోరు బావులను ఆధారంగా చేసుకొని పసుపు, మొక్కజొన్న, కూరగాయలతో పాటు తదితర ఆరుతడి పంటలను జిల్లాలో పెద్ద ఎత్తున సాగు చేస్తుంటారు. బోరు బావులకు ప్రస్తుతం కరెంటు సమస్య ఓవైపు, పడిపోతున్న భూగర్భ జలాల మట్టం మరోవైపు తీవ్ర సమస్యగా మారిందంటున్నారు. భూగర్భ జలాల మట్టం తగ్గుముఖం పడుతుండడంతో బోరు బావుల ద్వారా నీరు సక్రమంగా రావడం లేదంటున్నారు. దీంతో పంటలకు అరకొరగానే నీరందించాల్సిన పరిస్థితి ఏర్పడుతోందని చెబుతున్నారు. సగటున కాకుండా 10 నుండి 16 మీటర్ల వరకు కొన్నిచోట్ల భూగర్భ జలాల మట్టం పడిపోయిందని అధికారులు వివరిస్తున్నారు. జిల్లాలోని లోకేశ్వరం మండలం మన్మద్, తానూర్ మండలం ఓసి గ్రామాల్లో భూగర్భ నీటిమట్టం 12 మీటర్ల లోతులో ఉండగా భైంసా మండలం కామోల్, కడెం మండలం చిన్న బెల్లాల్ తదితర గ్రామాల్లో ఇప్పటికే 16 మీటర్ల లోతులో నీటి మట్టాలు ఉన్నట్లు భూగర్భ జల శాఖ అధికారులు స్పష్టం చేస్తున్నారు. వేగంగా తగ్గిపోతున్న భూగర్భ జలాల కారణంగా 70 వేల వ్యవసాయ విద్యుత్ కనెక్షన్ దారులంతా ఆందోళనకు గురవుతున్నారు.

కుభీర్ మండలంలో మరింత దయనీయం

ముఖ్యంగా కుబీర్ మండలంలో భూగర్భ జలాల మట్టాలు వేగంగా తగ్గిపోతుండడంతో ఇక్కడి బోరు బావుల కింద సాగు చేసుకుంటున్న రైతాంగం ఆందోళనకు గురవుతోంది. ప్రస్తుత యాసంగిలో శనగపంటతో పాటు మొక్కజొన్న, జొన్న, నువ్వు, పొద్దు తిరుగుడు పంటలను రైతులు బోరు బావుల నీరు ఆధారంగా సాగు చేస్తున్నారు. కుబీర్‌తో పాటు దార్ కుబీర్, పార్డి (కే), సోనారి, గోడాపూర్ తదితర గ్రామాల్లోని పంట క్షేత్రాలలో సుమారు మూడు వేలకు పైగా బోరు బావులున్నట్లు అధికారులు పేర్కొంటున్నారు. ఈ బోరు బావుల కింద యాసంగిసాగులో భాగంగా 9 వేల ఎకరాల్లో మొక్కజొన్న, 8 వేల 500ల ఎకరాల్లో శనగ, 550 ఎకరాల్లో గోధుమ, 380 ఎకరాల్లో నువ్వు, 280 ఎకరాల్లో పొద్దుతిరుగుడు, 2 వేల 300ల ఎకరాల్లో జొన్న పంటలను సాగు చేస్తున్నారు. చాలా చోట్ల బోరు బావులలోని భూగర్భ జలం అడుగంటి పోతుండడంతో నీటిని ఎత్తిపోయడం లేదని కొన్ని చోట్ల తక్కువ నీరు ఎత్తిపోస్తున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

భూగర్భ జలాలు గణనీయంగా తగ్గిపోతున్నాయి

● శ్రీనివాస్‌బాబు
జిల్లా భూగర్భ జలశాఖ అధికారి

జిల్లాలో క్రమంగా భూగర్భ జల మట్టాలు పడిపోతున్నాయి. జిల్లాలో సగటు భూగర్భ జల నీటిమట్టం 10 మీటర్లుగా ఉంది. భైంసా డివిజనల్‌లో భూగర్భ జలాలు వేగంగా తగ్గి పోతున్నాయి. ప్రస్తుతం అక్కడి కొన్ని గ్రామాల్లో 16 మీటర్ల లోతుకు భూగర్భ జలాల మట్టాలు చేరు కున్నాయి. మే నెలలో మరింత వేగంగా భూగర్భ నీటి మట్టాలు తగ్గిపోయే అవకాశాలు ఉన్నాయి. దీని కారణంగా బోరు బావులలో నీరు మరింత కిందకు పడి పోనుంది. పంటలకే కాకుండా తాగునీటికి సైతం ఇబ్బందులు తలెత్తవచ్చు. ఎండ తీవ్రతల కారణంగా 40 శాతం నీరు ఆవిరి రూపంలో కరిగి పోతుంది. రైతులు కొత్తగా బోరు బావులు తవ్వించవద్దు. ప్రతి ఇంట్లో ఇంకుడు గుంతలు తవ్వించాలి. అలాగే చెరువులు, వాగులు, ఒర్రెల నుండి ఇసుక తవ్వకాలు జరగకుండా చూడాలి.



30 బోర్లు వేసిన నీరు రాకపోవడంతో రాజుర గ్రామానికి చెందిన రైతు పఠాని నడిపి మల్లన్న ఆత్మహత్య (ఫైల్)



అమ్మవారిని దర్శించుకున్న వేణుగోపాలచారి



బాసర ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న చారి

బాసర, మే 7 (ఆంధ్రజ్యోతి) : బాసర సరస్వతీ అమ్మవారి ఆలయాన్ని బుధవారం సీనియర్ రాజకీయ నాయకులు, మాజీ కేంద్రమంత్రి వేణుగోపాలచారి సందర్శించారు. అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేకపూజలు నిర్వహించారు. త్వరలోనే పెండింగ్‌లో ఉన్న బాసర ఆలయ మాస్టర్‌ప్లాన్ అమలు జరిపి అభివృద్ధి చేస్తామని చెప్పారు. ఆయన వెంట కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకలు సంజీవ్ రావు దేశాయి తదితరులు ఉన్నారు.

ఎస్సై శ్రీకాంత్‌ను అభినందించిన ఎస్పీ జానకీ షర్మిల



ఎస్సై శ్రీకాంత్‌ను అభినందిస్తున్న ఎస్పీ జానకీషర్మిల

సారంగాపూర్, మే 7 (ఆంధ్రజ్యోతి) : మండలంలో గల మహబూబా ఘాట్ వద్ద గత మూడు సంవత్సరాల క్రితం ఒక రోడ్డు ప్రమాదం జరిగింది. లోయలో చిక్కుకున్న ముగ్గురుని ఎస్సై శ్రీకాంత్ సిబ్బందితో తమ ప్రాణాలను లెక్క చేయకుండా ధైర్య సాహసాలతో ప్రాణాలను కాపాడారు. దీనిని గుర్తించి రియల్ హీరోస్ అవార్డును సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా ఎస్సై శ్రీకాంత్ అందుకున్నారు. ఈ సందర్భంగా బుధవారం జిల్లా ఎస్పీ జానకీ షర్మీల ఆయనను అభినందించి.. మంచి పని చేసిన సిబ్బందికి సమాజంలో ఎప్పుడు గుర్తింపు ఉంటుందని పేర్కొన్నారు.

తాగునీటి సమస్యను పరిష్కరించాలని కోరుతూ

జిల్లా కలెక్టరేట్ ఎదుట ఆదివాసీల ధర్నా



తాగునీటి సమస్యను పరిష్కరించాలని వినతిపత్రం అందజేస్తున్న ఆదివాసీలు

నిర్మల్ అర్బన్, మే 7 (ఆంధ్రజ్యోతి) : పెంబి మండలంలోని మారుమూల గిరిజన ప్రాంతాల్లో తాగునీటి ఎద్దడి నెలకొందని, ఈ సమస్యను వెంటనే పరిష్కరించాలని కోరుతూ బుధవారం జిల్లా కలెక్టరేట్ ఎదుట ఆదివాసీలు ధర్నా కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఆదివాసీ సంఘం నేత తొడసం శంభు మాట్లాడుతూ.. పెంబి మండలంలోని ఆదివాసీలు తాగునీటి కోసం కిలోమీటర్ల మేర కాలినడకన వెళ్లాల్సి వస్తుందన్నారు. సమస్యలను తక్షణమే పరిష్కరించకపోతే పెద్దఎత్తున ఉద్యమాలు చేపట్టనున్నట్లు హెచ్చరించారు. తాగునీటి ఎద్దడి సమస్యను పరిష్కరించేత వరకు రాజీలేని పోరాటం చేస్తామన్నారు. మా పోరాటం రాష్ట్ర వ్యాప్తంగా విస్తరించేలా చేపట్టనున్నట్లు తెలిపారు. ముఖ్యంగా మిషన్ భగీరథ నీటిని తక్షణమే అందజేయాలని, పాత సోలార్ పంపులకు మరమ్మతు పనులు చేపట్టి వాటిని సిద్ధం చేయాలన్నారు. నిర్మాణానికి అటవీశాఖ అనుమతులు ఇవ్వాలని, మంజూరైన ఇళ్ల నిర్మాణాన్ని పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం తాగునీటి సమస్యను పరిష్కరించాలని కోరుతూ జిల్లా కలెక్టరేట్‌లో వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో జిల్లా ఆదివాసీ నాయకులు టేకం ధర్మరాజు, టేకం భీమ్ రావు, ఆత్రం రాజు, ఆత్రం శ్యామ్‌రావు తదితరులు పాల్గొన్నారు.

వన్యప్రాణుల దాహార్తి తీర్చేందుకు ప్రత్యేక చర్యలు

● స్వచ్ఛంద సంస్థల సహకారంతో సాసర్ల ఏర్పాటు
● అటవీ భూములు ఆక్రమిస్తే కఠిన చర్యలు ● సీసీఎఫ్ శరవణన్



మాట్లాడుతున్న సీసీఎఫ్ శరవణన్

నిర్మల్, మే 7 (ఆంధ్రజ్యోతి) : వన్యప్రాణుల దాహార్తి తీర్చేందుకు ప్రత్యేకచర్యలు చేపడుతున్నామని.. దీని కోసం గాను స్వచ్ఛంద సంస్థల సహకారం తీసుకుంటున్నామని బాసర జోన్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ శరవణన్ పేర్కొన్నారు. బుధవారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. అడవులలో వన్యప్రాణుల దాహార్తిని తీర్చేందు కోసం అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నామన్నారు. ప్రభుత్వం నిధుల విడుదలలో జాప్యం చేస్తున్న కారణంగా స్వచ్ఛంద సంస్థల సహకారం తీసుకుంటున్నామని వివరించారు. ఇప్పటికే రెండు స్వచ్ఛంద సంస్థలు జిల్లాలోని అటవీ ప్రాంతాల్లో వన్యప్రాణుల దాహార్తిని తీర్చేందుకు ప్రత్యేకంగా సాసర్లను ఏర్పాటు చేస్తున్నాయన్నారు. వన్యప్రాణులను కాపాడేందుకు అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నామన్నారు. అటవీ భూముల ఆక్రమణలపై కఠినచర్యలు తీసుకుంటామన్నారు. నిర్మల్‌లోని కోతుల సంరక్షణ కేంద్రంలో అవసరమైన చర్యలు తీసుకునేందుకు గాను ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపామన్నారు. కోతులను పట్టే బాధ్యత స్థానిక సంస్థలే తీసుకోవాలన్నారు. అటవీ చట్టాలను పకడ్బందీగా అమలు చేస్తామన్నారు. ఈ మీడియా సమావేశంలో డీఎఫ్‌వో షేక్ ఆదం, నాగిని భాను పాల్గొన్నారు.

రాజీవ్ యువ వికాసానికి 1315 దరఖాస్తులు



దరఖాస్తు ఫారాలను పరిశీలిస్తున్న ఎంపీడీవో

ముథోల్, మే 7 (ఆంధ్రజ్యోతి) : రాజీవ్ యువ వికాసానికి మండలంలోని 19 గ్రామ పంచాయతీల నుంచి 1315 మంది దరఖాస్తులు చేసుకున్నట్లు ఎంపీడీవో శివ కుమార్ తెలిపారు. ఏప్రిల్ 3వ తేదీ నుండి 14వ తేదీ వరకు ఆసక్తి గల నిరుద్యోగులు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకున్నారని పేర్కొన్నారు. సంబంధిత పత్రాలను మండలాభివృద్ధి కార్యాలయంలో అందజేసిన వాటిని వెను వెంటనే సిబిల్ వెరిఫికేషన్ కొరకు సంబంధిత బ్యాంక్‌లకు పంపించడం జరుగుతుందని ఎంపీడీవో తెలిపారు. ఇదివరకు మండలంలోని ఆయా గ్రామాల నుండి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న వివరాలు ఈ విధంగా ఉన్నాయి. ఎస్సీ 290 దరఖాస్తులు, ఎస్టీ 90, ఈబీసీ 17, ఎంబీసీ 28, బీసీ 466, మైనార్టీ 297 మంది దరఖాస్తులు చేసుకున్నారు.

తెలంగాణ రాష్ట్ర పర్యాటక శాఖ

కార్పొరేషన్ ఛైర్మన్‌ను కలిసిన జిల్లా గ్రంథాలయ ఛైర్మన్



నిర్మల్ అర్బన్, మే 7 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ రాష్ట్ర పర్యాటకశాఖ కార్పొరేషన్ ఛైర్మన్ పటేల్ రమేష్‌రెడ్డిని నిర్మల్ జిల్లా గ్రంథాలయ ఛైర్మన్ సయ్యద్ అర్జుమన్ అలీ మర్యాదపూర్వకంగా కలిశారు. నిర్మల్ పట్టణానికి సంబంధించిన బంగాల్‌పేట్ చెరువు, వినాయకసాగర్, సోన్ మండలం పాక్‌పట్ల క్రొకోడైల్ పార్క్ గురించి చర్చించారు. వారు సానుకూలంగా స్పందించి, వచ్చే జూన్ నెలలో దానికి సంబంధించిన అధికారులను పంపించి అభివృద్ధి పనులు చేయించడం జరుగుతుందని చెప్పారు.

మాలేగాంలో జొన్నల కొనుగోలు కేంద్రం ప్రారంభం

కుభీర్, మే 7 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మాలేగాం గ్రామంలో ఎఫ్‌పీసీఎల్ రాష్ట్ర ప్రభుత్వం, మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో బుధవారం జొన్నల కొనుగోలు కేంద్రం ప్రారంభించారు. ఇందులో భాగంగా కుభీర్ మహిళ ఎఫ్‌పీసీఎస్ ఛైర్ పర్సన్ స్వప్న, ఏవో సారిక, ఏఈవో మహేష్, మాలేగాం మాజీ సర్పంచ్ మహిపాల్‌రెడ్డి, కే. శంకర్, రైతుసమన్వయ సమితి అధ్యక్షులు రమేష్, ఏపీఎంఏఎస్ఎస్ డైరెక్టర్ మురళీ, ఎంఐఎస్ ఆదిత్య, కుభీర్ సీఈవో సంగి శ్రీనివాస్, లక్ష్మణ్, తదితరులున్నారు.

కొనుగోలు కేంద్రంలో అసౌకర్యాలు

● అందకూర్‌లో నిర్వాహకులపై ఆగ్రహం వ్యక్తం చేసిన కలెక్టర్ అభిలాష అభినవ్ ● అలసత్వానికి రూ. 2 లక్షల జరిమానా



అందకూర్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్



కుంటాల రెవెన్యూ సదస్సులో సిబ్బందికి సూచనలు ఇస్తున్న కలెక్టర్

కుంటాల, మే, 7 : (ఆంధ్రజ్యోతి) : ధాన్యం కొనుగోలు కేంద్రంలో రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా అన్ని సౌకర్యాలు కల్పించాలని కలెక్టర్ అభిలాష అభినవ్ అన్నారు. బుధవారం కుంటాల మండలంలోని అందకూర్ గ్రామంలో సహకార సంఘం ఆధ్వర్యంలో కొనుగోళ్లు నిర్వహిస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ కొనుగోలు కేంద్రంలో రైతులకు ఎండవేడమి నుంచి రక్షించుకునేందుకు టెంటు సౌకర్యం, తాగునీటి సౌకర్యం తదితర వసతులు లేకపోవడం వలన ఆమె అసంతృప్తి చెంది ఆగ్రహం వ్యక్తం చేశారు. నిర్వాహకుల నిర్లక్ష్యం వలన రైతులకు ఇబ్బందులు తలెత్తుతాయని పేర్కొన్నారు. సంబంధిత అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కేంద్రానికి వచ్చిన ధాన్యాన్ని తక్షణమే తూకం వేసి తరలించాలన్నారు. తేమ శాతం నిబంధనల మేరకే కొనుగోలు చేయాలని సూచించారు. తగినన్నీ గన్నీ సంచులు, టార్పలిన్‌లు సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. అన్ని రిజిస్టర్లను పరిశీలించిన అనంతరం ఇప్పటి వరకు కొనుగోలు చేసిన ధాన్యం వివరాలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. సిబ్బంది నిర్లక్ష్యం మూలంగా రెండు లక్షల రూపాయల జరిమానా విధించినట్లు తెలిపారు. వర్షాలు కురిసే అవకాశాలు ఉన్నందున అప్రమత్తంగా ఉండాలని ఏవైనా సమస్యలుంటే ఉన్నాతాధికారుల దృష్టికి తేవాలని కలెక్టర్ రైతులకు సూచించారు. ఈ తనిఖీలో అదనపు కలెక్టర్ కిశోర్‌కుమార్, ఆర్డీవో కోమల్‌రెడ్డి ఉన్నారు.

భూ సమస్యల పరిష్కారానికే భూ భారతి

ప్రభుత్వం రాష్ట్రంలో గత కొద్దిరోజుల నుంచి రైతుల భూముల సమస్యలు ఎక్కువవడం వలన వాటిని పరిష్కరించేందుకు నూతనంగా భూభారతి పథకాన్ని ప్రవేశపెట్టిందని రైతులు సద్వినియోగ పరుచుకోవాలని కలెక్టర్ అభిలాష అభినవ్ అన్నారు. కుంటాల మండలం పైలట్ ప్రాజెక్టులో భాగంగా భూభారతి పథకానికి ఎంపికైనందున గత మూడు రోజుల నుంచి మండలంలోని ఆయా గ్రామాలలో భూసమస్యల పరిష్కారం కోసం రెవెన్యూ సదస్సులను నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా బుధవారం మండల కేంద్రం కుంటాలలో నిర్వహించే రెవెన్యూ సదస్సులో కలెక్టర్ పాల్గొన్నారు ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాల వారీగా రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తూ భూ రికార్డులలో పేరు, విస్తీర్ణం, లోపాలు, నిషేధిత జాబితాలో భూములు, సాదాబైనామాలు, వారసత్వ భూములు, హద్దుల తగాదాలు, తదితర సమస్యలను పరిష్కరించేందుకే ఈ రెవెన్యూ సదస్సులు నిర్వహించి రైతులతో ముఖాముఖి చర్చించి వారి సమస్యలను తెలుసుకుంటున్నామన్నారు. ప్రతి దరఖాస్తుకు రసీదు ఇవ్వాలని, సత్వర విచారణ అనంతరం సమస్యను తహసీల్దార్ స్థాయిలో పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ కిశోర్‌కుమార్, ఆర్డీవో కోమల్‌రెడ్డి, ప్రత్యేక రెవెన్యూ అధికారి ప్రవీణ్‌కుమార్, సిబ్బంది తదితరులు ఉన్నారు.

ప్రభుత్వ భూములు ఆక్రమిస్తే చర్యలు తప్పవు

నిర్మల్ అర్బన్, మే 7 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ భూములను ఆక్రమించి అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసుకున్న వారిపై చట్ట ప్రకారం కఠినచర్యలు తీసుకుంటామని కలెక్టర్ అభిలాష అభినవ్ బుధవారం ఒక ప్రకటనలో హెచ్చరించారు. జిల్లాలో ఆక్రమణకు గురైన ప్రభుత్వ భూముల గుర్తింపు ప్రక్రియ కొనసాగుతుందని, పలు మండలాల్లో ఆక్రమణకు గురైన కోట్లాది రూపాయల విలువ చేసే ప్రభుత్వ భూములను గుర్తిస్తున్నామని తెలిపారు. ఇప్పటి వరకు నాలుగు మండలాల్లో అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసుకొని కబ్జా చేసిన ప్రభుత్వ భూములను గుర్తించి స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. గత ఆరు నెలలుగా జిల్లాలోని వివిధ మండలాల్లో నిర్వహిస్తున్న ఆక్రమణల గుర్తింపు ప్రక్రియలో భాగంగా ఈ భూములు వెలుగులోకి వచ్చాయని తెఇపారు. నిర్మల్ గ్రామీణ మండలంలో 35.03 ఎకరాలు (రూ. 5.77 కోట్లు), భైంసా మండలంలో 18.31 ఎకరాలు (రూ.2.07 కోట్లు), నర్సాపూర్(జి) మండలంలోని 16 ఎకరాలు (రూ.2.04 కోట్లు), మొత్తం 82 ఎకరాలు అన్యాక్రాంతం అయిన కోట్లాది విలువైన ప్రభుత్వ భూములను గుర్తించి స్వాధీనం చేసుకున్నామని కలెక్టర్ తెలిపారు. ఆక్రమణదారులపై చట్టప్రకారం క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని, ప్రభుత్వ భూముల ఆక్రమణల గుర్తింపు ప్రక్రియ పలు మండలాల్లోని 260 ఎకరాల్లో కొనసాగుతుందని తెలిపారు. జిల్లాలోని ప్రభుత్వ రెవెన్యూ, అటవీ భూములు, చెరువు శిఖంభూములు, సాగునీటి ప్రాజెక్టుల కాలువలు తదితర భూములను అక్రమంగా ఆక్రమించిన వారిపై కఠినచర్యలు ఉంటాయని హెచ్చరించారు.

విద్యార్థిని అభినందించిన కలెక్టర్

ఇటీవల పదవతరగతి ఫలితాల్లో 586 మార్కులు సాధించి రాష్ట్ర స్థాయిలో, జిల్లా స్థాయిలో ఉత్తమర్యాంక్ సాధించిన నిర్మల్‌లోని ఎస్ఆర్ డీజీ పాఠశాల విద్యార్థిని ఎస్. శివప్రియను బుధవారం నిర్మల్ జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ తమ కార్యాలయంలో అభినందించారు.

న్యూ ఇండియా లిటరసీ కార్యక్రమాన్ని విజయవంతం చేయండి

జిల్లా అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్



అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్

నిర్మల్ కల్చరల్, మే 7 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో చేపట్టబోయే న్యూ ఇండియా లిటరసీ కార్య క్రమాన్ని విజయవంతం చేయాలని అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. జిల్లాలోని నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా మార్చేందుకు కార్యక్రమం చేపడుతున్నట్టు తెలిపారు. మండలాల వారీగా నిరక్షరాస్యుల వివరాలు సేకరించి వారికి కనీసవిద్యను అందించాలన్నారు. బాసర మండలాన్ని పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసి ప్రారంభించనున్నట్టు వివరించారు. అన్ని గ్రామాల్లోని మహిళా సంఘాలతో నిరక్షరాస్యులను గుర్తించాలని వారిని అక్షరాస్యులుగా చేయాలని సూచించారు. ప్రధానోపాధ్యాయులు, అంగన్‌వాడీలు, మండల స్థాయిలో ఎంపీడీవోలు, ఎంఈవోలు, ఇతర అధికారులతో సమన్వయ కమిటీలు ఏర్పాటు చేసి కార్యాచరణ రూపొందించాలన్నారు. యువత, రిటైర్డ్ ఉపాధ్యాయులు, ఉద్యోగులు వాలంటీర్లుగా పని చేసేందుకు స్వచ్ఛందంగా ముందుకు రావాలని పిలుపునిచ్చారు. బడి మానివేసిన వారిని గుర్తించి ఓపెన్ స్కూళ్లల్లో చేర్పించాలన్నారు.

నిరక్షరాస్యులైన వారికి విద్యను అందించి ధ్రువీకరణ పత్రాలు అందించాలని ఆదేశించారు. డీఈవో రామారావు, జిల్లా ఇంటర్మీడియట్ అధికారి పరుశరాం, డీఆర్డీవో విజయలక్ష్మి, వయోజన విద్యాధికారి తిరుపతి రావు, మెప్మా పీడీ సుభాష్, అధికారులు పాల్గొన్నారు.

పరిశ్రమల శాఖలో

పోస్టుల భర్తీ దరఖాస్తుల ఆహ్వానం

నిర్మల్ కల్చరల్, మే 7 (ఆంధ్రజ్యోతి) : జిల్లా పరిశ్రమల శాఖలో కొత్తగా మేనేజర్, అసిస్టెంట్ మేనేజర్ పోస్టులను సృష్టించినట్టు కలెక్టర్ అభిలాష అభినవ్ తెలిపారు. బుధవారం విడుదల చేసిన ప్రకటనలో పరిశ్రమల రంగాన్ని మెరుగుపరిచేందుకు కొత్తపోస్టులు మంజూరయ్యాయని తెలిపారు. జాతీయ సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల సంస్థ జిల్లాకు పోస్టు మంజూరు చేసిందన్నారు. వీటిని కాంట్రాక్ట్ పద్ధతిన అర్హులైన వారికి ఈ పోస్టులలో నియమిస్తారన్నారు. ఈ నెల 10లోగా దరఖాస్తులను స్వీకరిస్తామని పేర్కొన్నారు. వివరాలకు వెబ్‌సైట్ సందర్శించాలన్నారు. కలెక్టరేట్‌లోని పరిశ్రమల మేనేజర్ రూమ్‌లో మేనేజర్‌ను తెలుసుకోవచ్చన్నారు.

జిల్లాలో అర్ధరాత్రి కురిసిన వర్షాలు

నిర్మల్, మే 7 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో మంగళవారం అర్ధరాత్రి అకాల వర్షాలు కురిశాయి. జిల్లాలో నమోదైన వర్షపాతం వివరాలు ఈ విధంగా ఉన్నాయి. జిల్లా సగటు వర్షాపాతం 3.5 మిల్లీమీటర్లు కాగా, జిల్లాలో అత్యధికంగా సారంగాపూర్ మండలంలో 16.4 మిల్లీమీటర్లుగా నమోదైంది. అలాగే మామడలో 11.2 మిల్లీమీటర్లు నమోదు కాగా కడెంలో 9.4 మిల్లీమీటర్లు, దస్తురాబాద్‌లో 6.4 మిల్లీమీటర్లు వర్షపాతం నమోదైంది.

తాగుడికి బానిసై ఒకరి ఆత్మహత్య



లోకేశ్వరం, మే 7 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కనకాపూర్ గ్రామంలో మద్యం తాగుడికి బానిసై ఒకరు మృతి చెందాన సంఘటన బుధవారం చోటుచేసుకుంది. కుటుంబీకులు, పోలీసుల వివరాల ప్రకారం.. చిన్నవాయి సాయన్న (67) గత కొంతకాలంగా మద్యం తాగుడికి బానిసై ఇంట్లో వారితో డబ్బుల కోసం గొడవపడుతూ ఉండేవాడు. బుధవారం రోజున కూడా మృతు మద్యం తాగుడికి డబ్బులను ఇంట్లో వాళ్లను అడుగగా కుటుంబ సభ్యులు రోజు మద్యం తాగడం ఎందుకని అతన్ని మందలించగా సాయన్న ఇంట్లో ఎవరూ లేని సమయంలో జీవి తం మీద విరక్తి చెందిం ఇంటి వెనకాల గల పశువుల కొట్టంలో రేకుల షెడ్ దూలానికి తాడుతో ఉరివేసుకొని మృతి చెందాడు. మృతుడి భార్య చిన్నవాయి చిన్నక్క దరఖాస్తు మేరకు లోకేశ్వరం ఎస్సై అశోక్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

వడగళ్ల వానతో పంటలు

నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

కడెం, మే 7 (ఆంధ్రజ్యోతి) : ఇటీవల కురిసిన వడగళ్ల వాన వల్ల పంటలు నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని బహుజన కమ్యూనిస్ట్ పార్టీ రాష్ట్ర నాయకులు పసుపుల వెంకన్న డిమాండ్ చేశారు. బుధవారం మండల కేంద్రమైన కడెంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ... ఇటీవల కురిసిన వడగళ్ల వాన వల్ల రైతులు తమ పంటలను తీవ్రంగా నష్టపోయారన్నారు. అలాగే ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ధాన్యాన్ని కొనుగోలు చేసి వెంటనే ధాన్యాన్ని లారీల ద్వారా రైస్ మిల్లులకు రవాణా చేసే చర్యలు చేపట్టాలని ఆయన కోరారు. రైతులు విక్రయించిన పంట ధాన్యాన్ని రైస్ మిల్లర్లు చేస్తున్న దోపిడీని అరికట్టాలన్నారు. ధాన్యం విక్రయించిన రైతులకు ధాన్యం డబ్బులను వెంటనే అందేటట్లు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. లేని యెడల బీసీపీ పార్టీ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు.



జొన్న పంటను తూకం వేస్తున్న హమాలీలు

మార్కెట్ యార్డులో జొన్న పంట తూకం

బోథ్, మే 7(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని మార్కెట్ యార్డులో నిలిచిపోయిన జొన్న పంట కొనుగోలు తూకం తిరిగి బుధవారం ప్రారంభమైంది. మార్కెట్ కమిటీ చైర్మన్ బొడ్డు గంగారెడ్డి అధికారులతో కలిసి చర్చలు జరిపారు. అయితే గతంలో జొన్న పంట తూకం వేసిన హమాలీలు తూకం వేసేందుకు నిరాకరించడంతో నూతనంగా లైసెన్స్‌లు జారీ చేయనున్న హమాలీలతో తూకం వేయించారు. అయితే గతంలో తూకం వేసిన హమాలీలు మాత్రం ప్రభుత్వ ధరకు హమాలించడం గిట్టుబాటు కాదని పేర్కొనడంతో నూతనంగా వచ్చిన హమాలీలు ప్రభుత్వ ధరల్లోనే తూకం వేస్తామని పేర్కొనడంతో జొన్నలతో తూకం ప్రారంభమైంది. అయితే తమను కాదని నూతనంగా వచ్చిన హమాలీలతో తూకం వేయించడం పట్ల హమాలీల సంఘం అధ్యక్షుడు రాజేశ్వర్ ఆవేదన వ్యక్తం చేశారు. రెండు నెలలు మాత్రమే పని ఉంటుందని, మిగతా నెలలో తమ ఉపాధి దొరకదని, అందుకు రైతుల వద్ద నుంచి పది రూపాయలు అదనంగా అడిగామన్నారు. తమను కాదని తూకం వేయించుకుంటే అభ్యంతరం లేదని, కనీసం నెలకు పది వేల రూపాయలు వేతనంగా ఇవ్వాలని డిమాండ్ చేశారు. కాగా తూకం ప్రశాంతంగా జరిగే విధంగా స్థానిక ఎస్సై ప్రవీణ్ ఆధ్వర్యంలో బందోబస్తును నిర్వహించారు.

● జొన్న పంట కొనుగోళ్లను వేగవంతం చేయండి

బోథ్: బోథ్ మార్కెట్ యార్డులో జొన్న పంట కొనుగోలను వేగవంతంగా చేపట్టాలని రైతు స్వరాజ్య వేదిక జిల్లా అధ్యక్షుడు సండెపు బొర్రన్న డిమాండ్ చేశారు. బుధవారం బోథ్ మండల కేంద్రంలోని మార్కెట్ యార్డులో మార్కెట్ ఆధ్వర్యంలో కొనుగోలు చేస్తున్న జొన్న పంట కొనుగోలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు.

సమ్మర్ క్యాంపులను వినియోగించుకోవాలి

బోథ్, మే 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని కౌటా(బి) ఉన్నత పాఠశాలలో సమ్మర్ క్యాంపులను నిర్వహిస్తున్నట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు శశిధర్ రెడ్డి పేర్కొన్నారు. అయితే విద్యార్థులు సమ్మర్ క్యాంపులను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఉదయం 8 గంటల నుంచి 11 గంటల వరకు క్లాసులను నిర్వహించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు కె.గంగయ్య, టి.శ్రీనివాస్ రెడ్డిలు పాల్గొని క్యాంపు నిర్వహణపైన పలు విషయాలను విద్యార్థులకు వివరించారు.

రైతు వేదికల్లో ఫార్మర్ రిజిస్ట్రీ ప్రారంభం

ఉట్నూర్, మే 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉట్నూర్, దంతన్‌పల్లి రైతు వేదికల్లో వ్యవసాయ విస్తరణ అధికారులు కుడిమిత సుధాకర్, సాయి రైతుల రిజిస్ట్రీని బుధవారం ప్రారంభించారు. కేంద్ర ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలు రైతులకు అందుబాటులోకి వస్తాయని వివరించారు. ఈ కార్యక్రమంలో సరస్వతి, రైతులు పాల్గొన్నారు.

మందపల్లిలో దేశీదారు పట్టివేత

భీంపూర్, మే 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని అర్లి(టి) అనుబంధ గ్రామం మందపల్లి గ్రామానికి చెందిన మెస్రం కొండు అనే వ్యక్తి అక్రమ దేశీదారును ద్విచక్ర వాహనంపై మహారాష్ట్ర నుంచి రవాణా చేస్తూ అర్లి(టి) గ్రామ శివారు ప్రాంతంలో ఎక్సైజ్ అధికారులకు మంగళవారం పట్టుబడ్డాడు. అతని వద్ద నుంచి సుమారు 10 వేల రూపాయల విలువ గల దేశీదారు సీసాలను స్వాధీనం చేసుకుని అరెస్టు చేసినట్లు ఎక్సైజ్ ఎస్ఐ రెండ్ల విజేందర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ దాడిలో తానాజీ, నానంగ్‌సింగ్, వెంకటగిరి, శ్రీధర్‌లు, తదితరులు పాల్గొన్నారు.

పార్టీ కోసం కష్టపడే వారికే పదవులు

● టీపీసీసీ ఉపాధ్యక్షుడు, ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్‌బిన్ హందాన్ ● ఆదిలాబాద్‌లో పార్టీ విస్తృతస్థాయి సమావేశం

ఆదిలాబాద్ రూరల్/ ఆదిలాబాద్ అర్బన్, మే 7(ఆంధ్రజ్యోతి): పార్టీ కోసం కష్ట పడేవారికి పదవులు వెతక్కుంటూ వస్తాయని,జెండా మోసిన కార్యకర్తలను పార్టీ గుర్తిస్తుందని టీపీసీసీ ఉపాధ్యక్షులు, పరిశీలకులు, ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్‌బిన్ హందాన్ అన్నారు. ఆదిలాబాద్ పట్టణంలోని తరగింణి ఫంక్షన్ హాల్లో అసెంబ్లీ ఇన్‌చార్జి కంది శ్రీనివాస రెడ్డి అధ్యక్షతన జరిగిన అసెంబ్లీ నియోజక వర్గ కాంగ్రెస్ పార్టీ విస్తృతస్థాయి సమావేశంలో ఆయన మరో పరిశీలకులు టీపీసీసీ ప్రధాన కార్యదర్శి చిట్ల సత్యనారాయణతో కలిసి ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. కాంగ్రెస్ పార్టీ ఎంతో చరిత్ర కలిగి దేశానికి స్వాతంత్ర్యం తెచ్చిందని హందాన్ తెలిపారు. ఇక్కడ కాంగ్రెస్ పార్టీకి పునర్ వైభవం తీసుకురావాలనే ఉద్దేశంతో గ్రామ, మండల, బ్లాక్, పట్టణ, జిల్లా అధ్యక్ష పదవులను భర్తీ చేసేందుకు ఆశావహుల నుంచి దరఖాస్తులు స్వీకరించనున్నట్లు తెలిపారు. పార్టీలో ఉంటూ పార్టీ కోసం కష్టపడే నాయకులు దరఖాస్తు చేసుకోవచ్చునన్నారు. ప్రతీ పదవికి ఐదు చొప్పున అప్లికేషన్‌లు స్వీకరించి అధిష్టానానికి పరిశీలనకు పంపుతామన్నారు. అనంతరం అధిష్టానం నిర్ణయం మేరకు పదవుల ఎంపిక ప్రక్రియ కొనసాగుతుందన్నారు. కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి, ఏఐసీసీ సభ్యులు నరేష్ జాదవ్, డీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ భూపెల్లి శ్రీధర్, పట్టణ అధ్యక్షుడు గుడిపల్లి నగేష్, నాయకులు నర్సింగ్, శాంతన్‌రావ్, సాయి చరణ్‌గౌడ్, సామ రూపేష్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్

● బోథ్ నియోజకవర్గంలో పార్టీకి పునర్ వైభవం

ఇచ్చోడ: బోథ్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీకి పునర్ వైభవం తీసుకురావాలనే ఉద్దేశంతో గ్రామ, మండల, బ్లాక్, పట్టణ, జిల్లా అధ్యక్ష పదవులను భర్తీ చేసేందుకు ఆశావహుల నుంచి దరఖాస్తులు స్వీకరించినట్లు జిల్లా పరిశీలకుడు తాహెర్‌బిన్ హందన్, చిట్ల సత్యనారాయణ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని అభినందన్ గార్డెన్‌లో ఏర్పాటుచేసిన బోథ్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ఎంపీ సోయం బాపురావు మాట్లాడుతూ.. పార్టీ జెండా మోసిన కార్యకర్తలను పార్టీ గుర్తిస్తుందని, కొత్త పాత అనే తేడాలు లేకుండా కార్యకర్తలను పార్టీ గుర్తిస్తుందన్నారు. బూత్ స్థాయి నుంచి పార్టీ బలోపేతం కావాలంటే ముందుగా అధ్యక్ష పదవుల ఎంపిక చేయాల్సి ఉందని, అర్హుల నుంచి దరఖాస్తులను స్వీకరిస్తున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో బోథ్ నియోజకవర్గ ఇంచార్జి ఆడే గంజేదర్, ఆదిలాబాద్ ఇన్‌చార్జి కంది శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు వేణుగోపాలచారి, కుమ్రం కొటేశ్వర్, పసుల చంటి, గోక గణేష్‌రెడ్డి, మల్లెపూల నర్సయ్య, నరేష్, తదితరులు పాల్గొన్నారు.

సమాజ సేవ చేయాలి : ఎమ్మెల్యే బొజ్జు

ఉట్నూర్, మే7 (ఆంధ్రజ్యోతి): సమాజ హితం కోసం నిరంతరం ప్రతీ ఒక్కరు కృషి చేయాలని, అప్పుడే సమాజంలో మార్పులు వస్తాయని ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుపటేల్ అన్నారు. బుధవారం మండలంలోని కన్నాపూర్ గ్రామాన్ని సందర్శించారు. ముందుగా ఈ గ్రామంలో అర్పీజీ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఆర్‌ఓ వాటర్ ప్లాంట్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ మారుమూల ఆదివాసీ గ్రామంలో శుద్దనీటి ఆర్‌ఓ ప్లాంట్‌ను ఏర్పాటు చేయడం అభినందనీయమని అన్నారు. ఇందులో జైనూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కుడ్మెత విశ్వనాథ్‌రావు, ఇంద్రవెల్లి వ్యవసాయ మార్కెట్‌కమిటీ వైస్ చైర్మన్ మారుతి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు అబ్దుల్ ఖయ్యుం, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు లింగంపల్లి చంద్రయ్య, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఇక్బాల్, గ్రామపటేల్ నైతం చిత్రుపటేల్, సంస్థ సభ్యులు పాల్గొన్నారు.

● బౌద్ధ పౌర్ణిమకు సాధారణ సెలవు ప్రకటించాలి

ఇంద్రవెల్లి: బుద్దిస్టులు అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకొనే బౌద్ధ పౌర్ణిమ (బుద్ధుని జయంతి) రోజున రాష్ట్ర ప్రభుత్వం సెలవు ప్రకటించాలని, బుద్ధిష్టుల డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ భారతీయ బౌద్ధ మహాసభ సభ్యులు ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ ఉట్నూర్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బుధవారం మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రం అందజేశారు. వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ముఖాడే ఉత్తం, నాయకులు రత్నరుఖాడే, ప్రజ్ఞాకుమార్, ప్రభాకర్ గడపాలే, దయానంద్, తదితరులున్నారు.

ప్రభుత్వానికి ధన్యవాదాలు : శైలజ

తలమడుగు, మే 7(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఆసుపత్రిలో విధులు ర్రవవర్తిస్తున్న ఫార్మసిస్టులను ఫార్మ ఆఫీసర్స్ నియమిస్తూ జీవో 71ని విడుదల చేసిన రాష్ట్ర ప్రభుత్వానికి ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతున్నామని తెలంగాణ ఫార్మ అసోసియేషన్ ఆదిలాబాద్ జిల్లా ఉపాధ్యక్షురాలు శైలజ ఫార్మా ఆఫీసర్ కోరారు. బుధవారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు.

ఆరోపణలు విడ్డూరం : ఎమ్మెల్యే పాయల

ఆదిలాబాద్ రూరల్, మే 7(ఆంధ్రజ్యోతి): పత్తి కొనుగోళ్లలో తాను అవినీతి చేశానని మాజీ మంత్రి జోగు రామన్న విమర్శించడం విడ్డూరంగా ఉందని, తానే తప్పు చేసి ఉంటే రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రికి ఫిర్యాదు ఎందుకు చేస్తానని ఎమ్మెల్యే పాయల శంకర్ ప్రశ్నించారు. బుధవారం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాజీ మంత్రి ఆరోపణాలను ఆయన ఖండించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాయల శంకర్ మాట్లాడారు. నిరాధరమైన ఆరోపణలు చేస్తే న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తానని ఎమ్మెల్యే పాయల శంకర్ స్పష్టం చేశారు.

● ఆపరేషన్ సిందూర్ సక్సెస్ : ఎమ్మెల్యే

పాకిస్థాన్‌పై ఆపరేషన్ సింధూర్ పూర్తిగా విజయవంతం అయ్యిందని ఎమ్మెల్యే పాయల శంకర్ తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ.. పాకిస్థాన్ ఉగ్రవాదులు దేశ అమాయక ప్రజలపై దాడులు చేయడం బాధాకరమని, దీంతో వారి ఆత్మకు శాంతి చేకూరుతుందని పేర్కొన్నారు.

● పాడి పంటలతో చల్లంగా ఉండాలి

జైనథ్: నియోజకవర్గ ప్రజలు పాడి పంటలతో చల్లంగా ఉండాలని ఎమ్మెల్యే పాయల శంకర్ వేడుకున్నారు. బుధవారం జైనథ్ ఉమ్మడి మండలంలోని బోరజ్ పరిధిలోని గూడ గ్రామంలోని వేంకటేశ్వర స్వామి ఆలయంలో నిర్వహించిన కల్యాణోత్సవానికి హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు.

‘బీసీ బిల్లును 9వ షెడ్యూల్‌లో చేర్చాలి’

ఉట్నూర్, మే 7(ఆంధ్రజ్యోతి): దేశ వ్యాప్తంగా కులగణన చేయాలని, తెలంగాణ బీసీ బిల్లును 9వ షెడ్యూల్‌లో చేర్చాలని బీసీ ఆజాద్ ఫెడరేషన్ అధ్యక్షుడు జక్కని సంజయ్‌కుమార్ డిమాండ్ చేశారు. బుధవారం కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లాలోని వాంకిడి మండల కేంద్రం నుంచి ప్రారంభించిన పల్లెపోరుబాట కార్యక్రమం ద్వారా ఉట్నూర్‌కు చేరుకున్నారు. ఉట్నూర్ మండల కేంద్రంలోని ఐబీ చౌరస్తాలో ఉన్న అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసిన అనంతరం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు.

అంతా గోల్‌మాల్ దందా

(5వ పేజీ తరువాయి...)

విమర్శలు చేయడం రాజకీయ వర్గాల్లో చర్చకు దారి తీస్తుంది. దీంతో స్పందించిన ఎమ్మెల్యే పత్తి కొనుగోళ్లలో జరిగిన అక్రమాలపై తానే స్వయంగా వ్యవసాయ శాఖ మంత్రికి ఫిర్యాదు చేశానని ప్రకటించారు. అయితే అధికారుల విచారణ కొనసాగుతుండగానే నేతలు రాజకీయ విమర్శలు చేసుకోవడంపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటి వరకు అక్రమాలపై సంబంధిత శాఖల అధికారులతో ఉన్నత స్థాయి సమీక్ష సమావేశాన్ని నిర్వహించిన దాఖలాలు లేవు. ఏది ఏమైనా పత్తి కొనుగోళ్లలో జరిగిన అక్రమాలపై రాజకీయాలకు అతీతంగా విచారణ జరిపించి రైతులకు న్యాయం జరిగేలా నేతలు చొరవ తీసుకోవాలన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

ప్రైవేట్ వ్యాపారులపై ఫిర్యాదు

ఈ యేడు పత్తిని కొనుగోలు చేసిన కొంత మంది ప్రైవేట్ వ్యాపారులపై కూడా ఫిర్యాదులు వస్తున్నాయి. మార్కెటింగ్, వ్యవసాయ శాఖ అధికారులతో కుమ్మక్కై అడ్డదారిలో సీసీఐకి అధిక ధరలకు పత్తిని విక్రయించారనే ఆరోపణలున్నాయి. ఈ యేడు క్వింటాల్ పత్తి మద్దతు ధర రూ.7521 కాగా.. తేమ శాతం, నాణ్యత పేరిటా రైతుల నుంచి తక్కువ ధరకే కొనుగోలు చేసి తిరిగి సీసీఐకి భారీగా పత్తిని విక్రయించి దండుకున్నారనే విమర్శలు లేకపోలేదు. దీనిపై కూడా ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని రెండు మూడు ప్రైవేట్ జిన్నింగ్ మిల్లుల్లో జరిగిన లావాదేవీలపై విజిలెన్స్ అధికారులు ఆరా తీస్తున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే రెండు జిన్నింగ్ మిల్లుల యజమానులు సీసీఐకి అక్రమంగా పత్తిని విక్రయించినట్లు అధికారులు గుర్తించారు. తప్పుడు టీఆర్ పత్రాలతో భారీ అక్రమాలు జరిగినట్లు తెలుస్తుంది. కొంత మంది అధికారులకు డబ్బును ఆశచూపి అడ్డగోలు దందాకు ఎగబడ్డారనే విమర్శలు ఉన్నాయి. ముఖ్యంగా ఆదిలాబాద్ ఏబీ సెంటర్లలోనే భారీ అక్రమాలు జరిగి ఉంటాయని ఉన్నతాధికారులు అంచనా వేస్తున్నారు. అలాగే జీరో బేళ్ల పేరిటా గోల్‌మాల్ దందాకు తెరలేపినట్లు ఫిర్యాదులు కూడా వస్తున్నాయి. దీనిపై మరింత లోతుగా దర్యాప్తు జరిపితే కొంత మంది ప్రైవేట్ వ్యాపారుల అసలు బాగోతం బయటపడే అవకాశం ఉంటుంది.

ఇద్దరు నిందితులకు యావజ్జీవ శిక్ష

ఆదిలాబాద్ రూరల్, మే 7(ఆంధ్రజ్యోతి): జైనథ్‌లోని వైఆర్‌కే కన్‌స్ట్రక్షన్ ఏరియా వద్ద 2022 జనవరి 4న జరిగిన హత్య కేసులో జిల్లా న్యాయాధికారి నిందితులిద్దరికీ యావజ్జీవ శిక్ష, రూ.4వేల చొప్పున జరిమానా విధించినట్లు ఎస్పీ అఖిల్ మహాజన్ తెలిపారు. షేక్ అస్లాం, కోకాటి విజయ్ కలిసి తమ మిత్రుడైన ఇందూర్ గజానంద్‌ను 2022లో హత్య చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు నిందితులను కోర్టులో హాజరుపర్చగా జడ్జి వారికి శిక్ష విధించారు.

గిమ్మా వద్ద రోడ్డు ప్రమాదం.. ముగ్గురికి తీవ్ర గాయాలు

జైనథ్, మే 7(ఆంధ్రజ్యోతి): జైనథ్ ఉమ్మడి మండలంలోని బోరజ్ పరిధిలో గల గిమ్మా ఎక్స్‌రోడ్డు వద్ద మధ్యాహ్నం 2గంటల ప్రాంతంలో ఘోర రోడ్డు ప్రాంతంలో గుర్తుతెలియని లారీ ఢీకొని ఆటో నుజ్జునుజ్జు అయ్యింది. స్థానికులు, పోలీసుల వివరాల ప్రకారం.. ఆటో నెంబర్ టీఎస్01యూ సీ2956 ఆదిలాబాద్ నుంచి గిమ్మా గ్రామానికి వెళ్తుండగా గుర్తుతెలియని లారీ ఢీకొట్టడంతో ఆటో బోల్తా పడింది. దీంతో ఆటోలో ప్రయాణిస్తున్న ఆరుగురిలో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. ఇందులో గిమ్మా గ్రామానికి చెందిన గొంటి ముక్కుల నారాయణ (65) కాళ్లు చేతులు విరిగిపోయి ప్రాణపాయస్థితిలో ఉన్నారు. దీంతో పాటు గొంటిముక్కుల గంగన్న(28) మిగత వారికి స్వల్ప గాయాలయ్యాయి. గాయపడిన క్షతగాత్రులను చికిత్స నిమిత్తం ఆదిలాబాద్ రిమ్స్ ఆసుపత్రికి తరలించారు.

సోషల్ మీడియాలో పోస్టులు.. ముగ్గురి అరెస్ట్

ఆదిలాబాద్ రూరల్, మే 7 (ఆంధ్రజ్యోతి) : కత్తులతో సోషల్ మీడియాలో ప్రజలను భయాభ్రాంతులకు గురి చేసేలా పోస్టులు పెట్టిన ముగ్గురిపై జిల్లా 2 టౌన్‌లో కేసు నమోదు చేసినట్లు డీఎస్పీ జీవన్ రెడ్డి తెలిపారు. తాటిగూడకు చెందిన రాహుల్ జందాడే, క్రాంతినగర్కు చెందిన సయ్యద్ రిజ్వాన్, మహాలక్ష్మీవాడ చెందిన తైవార్ ఖాన్ సోషల్ మీడియాలో కత్తులు పట్టుకొని వీడియోలు పోస్ట్ చేశారు. దీంతో వారిపై పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేసినట్లు డీఎస్పీ వెల్లడించారు.

మున్సిపల్ సమస్యలు..

అధికారుల పనితీరుపై ఫిర్యాదుల వెల్లువ

● ప్రత్యేకాధికారి ఫైజాన్ అహ్మద్‌కు వినతిపత్రాలు అందచేసిన బీజేపీ నేతలు ● మున్సిపల్ అధికారులు పనితీరు మార్చుకోకుంటే చర్యలు తప్పవని ప్రత్యేకాధికారి హెచ్చరిక



ప్రత్యేకాధికారి ఫైజాన్‌అహ్మద్‌కు వినతిపత్రం అందజేస్తున్న బీజేపీ ప్రతినిధులు

భైంసా, మే 7 (ఆంధ్రజ్యోతి): పట్టణ పరిధిలో సమస్యలు పెరుకపోతున్న మున్సిపల్ అధికారులు పట్టించుకోవడం లేదని, అధికారులంతా నిర్లక్ష్యంగా విధులు నిర్వహిస్తూ బాధ్యతారహిత్యంగా వ్యవహరిస్తున్నారంటూ భైంసా బీజేపీ ప్రతినిధుల బృందం జిల్లా అడిషనల్ కలెక్టర్, మున్సిపల్ ప్రత్యేకాధికారి ఫైజాన్ అహ్మద్‌కు ఫిర్యాదు చేశారు. బుధవారం ప్రత్యేకాధికారి ఫైజాన్ అహ్మద్ భైంసాలో పర్యటించి మున్సిపల్ కార్యాలయంలో అధికారులు, సిబ్బందిత సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ భైంసా పట్టణ కమిటీ అధ్యక్షుడు రావుల రాము, జిల్లా కార్యవర్గ సభ్యుడు ఎనుపోతుల మల్లేశ్వర్, మున్సిపల్ మాజీ ఫ్లోర్ లీడర్ కపిల్‌సిండే నేతృత్వంలో పార్టీ ప్రతినిధుల బృందం ప్రత్యేకాధికారిని కలిసి పట్టణ సమస్యలన ఎకరువు పెట్టారు. అధికారుల తీరుపై పలు ఫిర్యాదులు చేశారు. పలు కాలనీల పరిధిలో నీటి సమస్య తీవ్రరూపం దాల్చిందని, పారిశుధ్య నిర్వాహణ వ్యవస్థ అస్తవ్యస్తంగా మారిందని వివరించారు. కొన్ని కాలనీల్లో వీధి లైట్లు వెలగడం లేదని తెలిపారు. తైబజార్ కాంట్రాక్టును టెండర్ ప్రక్రియ ద్వారా కాకుండా నామమాత్రంగా రుసుం పెంచి పాత కాంట్రాక్టర్‌కే అప్పచెప్పారని, తద్వారా మున్సిపల్ ఆదాయానికి గండి పడుతోందని తెలిపారు. చలి వేంద్రాల ద్వారా నీటిసరఫరా అంతంత మాత్రంగానే అందుతున్నాయని, మున్సిపల్ చెత్త తరలింపు వాహనాల రిపేర్ల పేరిట నిధులు దుర్వినియోగం అవుతున్నాయని ఆరోపించారు. మున్సిపల్ ఇంజనీరింగ్ అధికారులు ఎప్పుడు కూడా అందుబాటులో ఉండటం లేదని, మెప్మా అధికారులు పీఎం స్వనిధి ప్రచార బోర్డుల పంపిణీ చేపట్టకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఫిర్యాదు చేశారు. మున్సిపల్ కమిషనర్ ఎన్నిమార్లు కాల్ చేసిన సెల్‌ఫోన్ ఎత్తకుండా బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తున్నాని వివరించారు. అర్ధగంటకు పైగా పట్టణ పరిధిలోని ఆయా కాలనీలకు చెందిన బీజేపీ ప్రతినిధులు సమస్యల ఎకరువు పెట్టి, అధికారులపై లిఖితపూర్వకంగా ఫిర్యాదులు చేశారు. ఇందుకు స్పందించిన ప్రత్యేకాధికారి ఫైజాన్ అహ్మద్ మాట్లాడుతూ మున్సిపల్ కార్యాలయ నిర్వహణ వ్యవస్థ పూర్తి స్థాయిలో మెరుగుపరుస్తానని స్పష్టం చేశారు. ఇక నుంచి వారానికి ఒక పర్యాయం భైంసాలో పర్యటించి మున్సిపల్ కార్యాలయంలో అందరికి అందుబాటులో ఉంటానని తెలిపారు. పారిశుధ్య నిర్వాహణ వ్యవస్థ మెరుగుదలకు గాను గురువారం నుంచి స్పెషల్ డ్రైవ్ నిర్వహింప చేస్తామని పేర్కొన్నారు. ఇతర సమస్యలన్నింటిన పరిష్కరింప చేస్తానని వివరించారు. ఫిర్యాదులపై విచారణ జరిపి వచ్చిన నివేదిక ఆధారంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

అకాల వర్షానికి తడిసిన ధాన్యం

సారంగాపూర్, మే 7 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఆయా గ్రామాలలో బుధవారం ఉదయం కురిసిన వర్షానికి జొన్నపంటతో పాటు మొక్కజొన్నకు నష్టం వాటిల్లిందని రైతులు తెలిపారు. గత మూడు రోజుల క్రితం స్థానిక రాజీవ్ కాటన్ మార్కెట్ యార్డ్‌కు దళారులకు విక్రయించడానికి తీసుకువచ్చిన మొక్కజొన్న అకాల వర్షానికి తడిసి ముద్దయిందని ఆవేదన వ్యక్తం చేశారు.

సేంద్రియ ఎరువుల వినియోగం.. భూసార పరీక్షలపై అవగాహన

సోన్, మే 7 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని సిద్దులకుంట గ్రామంలో వ్యవసాయశాఖ, మార్క్‌ఫెడ్, విశ్వా ఆగ్రోటెక్ సంయుక్తంగా పసుపు, మొక్కజొన్నలో సేంద్రియ ఎరువుల వినియోగం, భూసార పరీక్షలు, కల్తీ సేంద్రియ ఎరువుల కట్టడి మొదలైన వాటిపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. జిల్లా వ్యవసాయ అధికారి అంజిప్రసాద్, మార్క్‌ఫెడ్ జిల్లా మేనేజర్ ప్రవీణ్ రెడ్డి మాట్లాడుతూ... ఆరోగ్యవంతమైన పంట దిగుబడులు రైతులు పొందాలంటే సేంద్రియ ఎరువుల వినియోగం పెరగాలని, డిపార్ట్‌మెంట్ ఆమోదించిన కంపెనీల ఎరువులను మాత్రమే తీసుకోవాలన్నారు. బిల్లు ఖచ్చితంగా ఇవ్వమని అడగాలని, గ్రామాల్లోకి అనుమతి లేని సేంద్రియ ఎరువుల పేరుతో వచ్చే నకిలీ ఎరువులను నిలువరించాలని పేర్కొన్నారు. సేంద్రియ ఎరువుల తయారీ, వాటి మోతాదు, అందులో ఉన్న పోషకాల గురించి విశ్వా ఆగ్రో టెక్ కంపెనీ వైస్ ప్రెసిడెంట్ వీవీరాజు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. వ్యవసాయంలో నూతన సాంకేతికతను జోడిస్తూ రైతులతో డైరెక్ట్‌గా మార్కెట్ అనుసంధాన, భూసార పరీక్షలు, విలువ ఆధారిత పంట ఉత్పత్తుల గురించి, ఫార్మర్ ప్రొడ్యూసర్స్ సంఘాల ఏర్పాటు, ఉపయోగాల గురించి అగ్రి ఫాబ్రిక్స్ సంస్థ సీఈవో మెండు శ్రీనివాసులు అవగాహన కల్పించారు. తదనంతరం కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన రైతు నమోదు ప్రక్రియను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో విశ్వా ఆగ్రో టెక్ సంస్థ సీఈవో సుభాష్, మేనేజర్ కృష్ణ, ఏవోలు వినోద్‌కుమార్, వికార్ అహ్మద్, నాగరాజు, ఏఈవోలు అశోక్ కుమార్, ప్రగతి, ఉమా మహేశ్వరి, రైతులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మార్క్‌ఫెడ్ నిర్మల్ జిల్లా మేనేజర్ ప్రవీణ్‌రెడ్డి

పహల్గాం దాడికి పాకిస్తాన్ మూల్యం చెల్లించాల్సిందే

● బీజేపీ నిర్మల్ జిల్లా అధ్యక్షులు రితేష్ రాథోడ్ ● ఆపరేషన్ సిందూర్‌కు మద్దతుగా ఖానాపూర్‌లో సంబరాలు



ఖానాపూర్‌లో జాతీయ పతాకాన్ని ప్రదర్శిస్తున్న బీజేపీ జిల్లా అధ్యక్షులు రితేష్ రాథోడ్

ఖానాపూర్, మే 7 (ఆంధ్రజ్యోతి) : పహల్గాంలో పర్యాటకులపై ఉగ్రమూకల దాడికి పాకిస్తాన్ మూల్యం చెల్లించాల్సిందేనని బీజేపీ నిర్మల్ జిల్లా అధ్యక్షులు రితేష్ రాథోడ్ అన్నారు. ఉగ్రవాదుల స్థావరాలను అంతమొందించేందుకు భారత్ చేపట్టిన ఆపరేషన్ సింధూర్‌కు మద్దతుగా బుధవారం ఖానాపూర్‌లో బీజేపీ ఆధ్వర్యంలో సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక తెలంగాణ చౌక్‌లో టపాసులు పేల్చి, మిఠాయిలు పంపిణీ చేశారు. జాతీయ పతాకాన్ని ప్రదర్శిస్తూ జయహో భారత్ అంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా రితేష్ రాథోడ్ మాట్లాడుతూ... భారత ప్రభుత్వం ఉగ్రమూకలకు సరైన గుణపాఠం చెబుతుందన్నారు. భారత సైన్యం చేపడుతున్న ప్రతి చర్యకు దేశంలో ప్రతి ఒక్కరూ మద్దతు ప్రకటిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ ఖానాపూర్ పట్టణ అధ్యక్షులు కీర్తి మనోజ్ కుమార్, మండల అధ్యక్షులు పుప్పాల ఉపేందర్, సీనియర్ నాయకులు బెజ్జారపు రాజేశ్వర్, రవీందర్‌రెడ్డి, గోపాల్‌రెడ్డి, కొండవేణి రమేష్, మాదాసు మురళి, జెట్టి సురేందర్, గోదాపురం సందీప్, దుర్గి అజయ్, కత్తుల శ్రీకాంత్, ఏ. రాజశేఖర్, బి. సుమంత్, పుప్పాల పవన్, అడిగెల మహేష్, శివ, తదితరులున్నారు.

బీజేపీ నాయకుల సంబురాలు

నిర్మల్ అర్బన్, మే 7 (ఆంధ్రజ్యోతి) : పాకిస్తాన్ ఉగ్రవాదుల స్థావరాలపై ఆపరేషన్ సింధూర్ పేరిట భారత్ వైమానిక దాడులు చేయడాన్ని హర్షిస్తూ బుధవారం నిర్మల్ జిల్లా కేంద్రంలో భారతీయ జనతా పార్టీ నాయకులు టపాసులు పేల్చి సంబరాలు జరుపుకున్నారు. అనంతరం ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. పహల్గాం దాడిలో భారత్ సైన్యం ప్రతీకారం తీసుకోవడం హర్షణీయం అని భారత సైన్యానికి, నరేంద్ర మోదీకి అందరం అండగా ఉంటామని నాయకులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నిజామాబాద్ జిల్లా ఇన్‌చార్జి, మాజీ జిల్లా అధ్యక్షుడు అంజు కుమార్ రెడ్డి, పార్లమెంట్ కన్వీనర్ అయ్యన్నగారి భూమయ్య, రాష్ట్ర నాయకులు రావుల రాంనాథ్, జిల్లా ప్రధాన కార్యదర్శి మెడిసెమ్మె రాజు, జిల్లా ఉపాధ్యక్షులు అలివేలు మంగ, కమల్ నయన్, దళిత మోర్చా జిల్లా అధ్యక్షుడు రాచకొండ సాగర్, బీజేవైఎం జిల్లా అధ్యక్షులు ఒడిసెల అర్జున్, మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు రజిని వైద్య, పట్టణ అధ్యక్షులు ఆకుల కార్తీక్, మాజీ పట్టణ అధ్యక్షులు సాధం అరవింద్, స్టేట్ కౌన్సిల్ సభ్యులు దశరథ్ పోశెట్టి, ఏ. సుధాకర్, నాయకులు శ్రీరామోజు నరేష్, రాజు, భరత్, భూపతి రెడ్డి, రాజేందర్, తదితరులు ఉన్నారు.

భవన నిర్మాణంలో నాణ్యత పాటించాలి

కుభీర్, మే 7 (ఆంధ్రజ్యోతి) : తహసీల్దారు నూతన భవన నిర్మాణంలో నాణ్యత పాటించాలని ముధోల్ ఎమ్మెల్యే పవార్ రామరావుపాటిల్ అన్నారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో ఎస్‌డీఎఫ్ నిధులు రూ.50లక్షలతో నిర్మించనున్న తహసీల్దార్ నూతన భవన నిర్మాణ పనులకు భూమి పూజ చేసి ప్రారంభించారు. అనంతరం మండల కేంద్రంలోని రైతువేదికలో ప్రభుత్వం మంజూరు చేసి 25 కల్యాణలక్ష్మీ, 5 షాదీముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. నియోజక వర్గం చేపడుతున్న పనులు మంజూరైన నిధులు వెల్లడించారు. కార్యక్రమంలో భైంసా ఏఎంసీ చైర్మన్ ఆనంద్ రావుపాటిల్, మాజీ ఎంపీపీ వడ్నం నాగజ్యోతినాగేశ్వర్, బోయిడి విఠల్, నాయకులు ప్యాట లక్ష్మణ్, ఏశాల దత్తాత్రి, బషీర్‌పటేల్, బంక బాబు, కందూర్ సాయినాథ్, రాజేశ్‌బాబు, కనకయ్య గులాబ్, తహసీల్దార్ శివరాజు, ఎంపీడీవో సాగర్‌రెడ్డి, ఎంపీవో మోహన్‌సింగ్, ఆర్ అండ్ బీ డీఈ సునీల్, ఏఈ విశాల్, తదితరులున్నారు.

కల్యాణలక్ష్మీ..షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ

భైంసా రూరల్, మే 7 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఐకేపీ కార్యాలయంలో భైంసా పట్టణం, మండలానికి చెందిన 116 మంది బీసీ, మైనారిటీ లబ్ధిదారులకు కళ్యాణలక్ష్మీ, షాదీ ముబారక్ చెక్కులను ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... గతం కంటే భిన్నంగా దరఖాస్తు చేసుకున్న స్వల్ప కాలంలోనే లబ్ధిదారులకు చెక్కులు అందించడం జరుగుతుందన్నారు. కేవలం 118 మంది లబ్ధిదారులకు చెందిన దరఖాస్తులు మాత్రమే పెండింగ్‌లో ఉన్నాయన్నారు.

ఇటుక బట్టీలను పరిశీలించిన అటవీ అధికారులు



ఇటుక బట్టీని పరిశీలిస్తున్న అటవీశాఖ అధికారులు

సారంగాపూర్, మే 7 (ఆంధ్రజ్యోతి) : మండలంలో గల బీరవెల్లి, ప్యారమూర్ గ్రామ ప్రాంతాల సమీపంలో మట్టి ఇటుకలను తయారు చేస్తున్నారు. ఇటుక బట్టీలను బుధవారం అటవీశాఖల అధికారులు ఎండీ నజీర్‌ఖాన్, తనిఖీ చేసి ఇటుకను తయారు చేసే వాటిని కాల్చడానికి ఊనుకను ఉపయోగించాలని, కట్టెలను ఉపయోగించవద్దని ఇటుక బట్టీల యజమానులతో సూచించారు. ఈ కార్యక్రమంలో రషీద్, ఫారుఅలీ, భీమేష్, మీనా, సంధ్యాలు ఉన్నారు.

కేటీఆర్ సహాయంతో స్వగ్రామానికి చేరుకున్న రెడ్డినాయక్

● ఫ్లైట్ టికెట్ రూ.30 వేలు ఇచ్చిన జాన్సన్ నాయక్

పెంబి, మే 7 (ఆంధ్రజ్యోతి) : హైదరాబాద్‌లో ఎప్‌సెట్ పరీక్ష రాసి తిరిగి వస్తుండగా రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన అక్కాచెల్లెలు మంజుల(17), అశ్విని(19)ల తండ్రి రెడ్డి నాయక్ బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సహాయంతో బుధవారం స్వగ్రామానికి చేరుకున్నారు. వివరాల్లోకి వెళ్తే లోతోర్య తాండ గ్రామానికి చెందిన బాణావత్‌రెడ్డి 6 సంవత్సరాల క్రితం ఉపాధి కోసం మలేషియా దేశం వెళ్లాడు. ఇతనికి భార్య, ముగ్గురు కూతుళ్లు, ఒక కొడుకు ఉన్నారు. మలేషియాలో ఇతను పని చేస్తున్న కంపెనీ మోసంచేయడంతో అక్కడే చిక్కుకున్నాడు. మే 1న ఎప్‌సెట్ పరీక్ష రాసి హైదరాబాద్ నుండి తిరిగి వస్తుండగా జక్రాన్‌పల్లి మండలంలోని అర్గుల్ గ్రామం వద్ద అతని కూతుళ్ల మంజుల, అశ్వినిలు రోడ్డు ప్రమాదంలో అక్కడికక్కడే మృతి చెందారు. మలేషియాలో చిక్కుకున్న తన తండ్రికి చివరి చూపుకూడా దక్కలేదు. సోషల్ మీడియా ద్వారా విషయం తెలుసుకున్న ఈ విషాదఘటనపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పందించి అండగా నిలిచారు. రెడ్డి నాయక్‌ను స్వగ్రామానికి తీసుకురావడానికి భారత దౌత్య అధికారులను సమన్వయం చేసి ప్రయాణ అనుమతులు, అక్కడి కంపెనీకి రూ. 1.20 లక్షలు చెల్లించి పాస్‌పోర్ట్ ఇప్పించాడు. అలాగే జాన్సన్‌నాయక్ ఫ్లైట్ టికెట్ ఖర్చులకు రూ. 30 వేలు అందించడంతో బుధవారం స్వగ్రామానికి చేరుకున్నారు. బాధితుడు బాణవత్‌రెడ్డి మాట్లాడుతూ మలేషియాలో చిక్కుకున్న తనకు కేటీఆర్ సారు ఫోన్ చేసి నిన్ను ఇండియాకు తీసుకువస్తా, నువ్వు బాధపడకు అని భరోసా ఇచ్చారు. ఇచ్చిన మాట ప్రకారం నేనుపని చేసిన కంపెనీతో మాట్లాడి పెనాల్టీ కట్టి నా పాస్‌పోర్ట్ ఇప్పించాడన్నారు. అలాగే జాన్సన్ నాయక్ ఫ్లైట్ టికెట్‌కు డబ్బులు పంపించాడన్నారు. జీవితాంతం కేటీఆర్, జాన్సన్ నాయక్‌కు రుణపడి ఉంటానని తెలిపారు.

అర్లి(కె) ఎక్స్‌రోడ్డు వద్ద రోడ్డు ప్రమాదం

నర్సాపూర్(జి), మే 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అర్లి(కె) ఎక్స్‌రోడ్డు వద్ద బుధవారం రాత్రి రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్రగాయాలు అయ్యాయి. స్థానికులు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మండల కేంద్రానికి చెందిన ఇర్ఫాన్ (40) లారీడ్రైవర్ గా విధులు నిర్వహిస్తున్నాడు. లారీ పార్క్‌చేసి తిరిగి ద్విచక్ర వాహనం పై ఇంటికి వస్తుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో తీవ్రగాయాలు అయ్యాయి. అర్లి(కె) గ్రామస్థులు వెంటనే 108కు ఫోన్ చేసి నిర్మల్ ఏరియా ఆసుపత్రికి తరలించారు.తల భాగంలో బలమైన గాయం కావడంతో ముక్కు నుండి తీవ్ర రక్తస్రావం కావడంతో 108 సిబ్బంది సాయినాథ్ కు ప్రధమ చికిత్స అందించారు.

మా భూమి రథయాత్రను విజయవంతం చేద్దాం

నర్సాపూర్(జి), మే 7 (ఆంధ్రజ్యోతి) : డాక్టర్ విశారదన్ మహారాజ్ లక్ష కిలోమీటర్ల మా భూమి రథయాత్రను జిల్లాలో విజయవంతం చేయాలని ధర్మ సమాజ్ పార్టీ, బీసీ, ఎస్సీ, ఎస్టీ జేఏసీ జిల్లా కన్వీనర్ రవీందర్ మహారాజ్ బుధవారం అన్నారు.

జొన్న పంటకు గిట్టుబాటు ధర

● అన్నదాతల హర్షం ● అకాల వర్షంతో రైతుల్లో గుబులు



రైతులు పండించిన జొన్నలు తెచ్చిన వాహనాలు



మార్క్‌ఫెడ్, సహకార మిత్ర ఆధ్వర్యంలో కొనుగోలు చేస్తున్న రైతుల జొన్నలు

ఉట్నూర్, మే 7 (ఆంధ్రజ్యోతి): రైతులు పండిస్తున్న పంటలను మధ్య దళారులు తన్నుకుపోయి లాభాలు గడిస్తూ ఉండడంతో ప్రభుత్వం రైతులకే ప్రయోజనం దక్కాలని ఏర్పాటు చేస్తున్న కొనుగోలు కేంద్రాల ద్వారా రైతులకు లాభాలు అందుబాటులోకి వస్తున్నాయి. ఉట్నూర్ మండలంలోని నాగపూర్ దాల్మిల్ సమీపంలో రైతు మిత్ర సహకార సంస్థ, మార్క్‌ఫెడ్ నేతృత్వంలో జొన్నల కొనుగోలు కేంద్రాన్ని రైతులకు అందుబాటులోకి తేవడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ సహకారంతో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రంలో రైతు లు పండించిన జొన్న పంటలు మాత్రమే కొనుగోలు చేయాలని దళారులు తెచ్చిన పంటలను కొనుగోలు చేయవద్దని ఆదేశించడంతో ఉట్నూర్ మండల రైతులు హర్షం వ్యక్తం చేశారు. ఉట్నూర్ మండలంలోని పెరికగూడెం, నాగపూర్, చీమనాయక్‌తండ, హస్నాపూర్, చాందూరి, ఎంకా, వడోని, ఎందా, నర్సాపూర్‌బి, లక్కేటిపేట, కుమ్మరితండా, ఆందోళి, పులిమడుగు ప్రాంతాలకు చెందిన రైతులు యాసంగి జొన్న పంటను 6723 ఎకరాల్లో సాగు చేసినట్లు మండల వ్యవసాయ అధికారులు పేర్కొంటున్నారు. ప్రజామిత్ర రైతు సహకార సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రంలో వారం రోజుల్లో 1613 క్వింటాళ్ల యాసంగి జొన్నలను కొనుగోలు చేశారు. ఈ కేంద్రానికి 45వేల క్వింటాళ్ల జొన్నలు వస్తాయని అధికారులు అంచనా వేశారు. క్వింటాల్ ధర రూ.3371 కేటాయించడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

అకాల వర్షాలతో గుబులు

వాతావరణంలో వచ్చిన మార్పులతో అకాల వర్షాలు వస్తే తెచ్చిన పంట తడిచి పోయి నష్ట పోవాల్సి వస్తుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఉట్నూర్ మండలంలోని వివిధ ప్రాంతాలకు చెందిన రైతులు తాము పండించిన యాసంగి జొన్న పంటను వాహనాలలో పాలిథిన్ కవర్లు కప్పి చేస్తున్నప్పటికి కొనుగోలు కేంద్రంలో కొనుగోలు చేసిన జొన్న పంటను మార్క్‌ఫెడ్ అధికారులు తరలించక పోవడంతో పంట కొనుగోలులో జాప్యం ఏర్పడుతుంది. ఇప్పటి వరకు 1613 క్వింటాళ్ల కొనుగోలు చేయగా, కేవలం 600 క్వింటాళ్లు మాత్రమే తరలించారు. మంగళవారంరాత్రి కురిసిన అకాల వర్షంకు పంటను రైతులు కాపాడుకున్నారు. భారీ వర్షంకురియక పోవడంతో తమ ఇబ్బంది తప్పిందని భారీ వర్షం పడితే పంటకు నష్టం జరిగేదని రైతులు పేర్కొన్నారు. తెచ్చిన పంటను త్వర త్వరగా కొనుగోలు చేయాలని రైతులు కోరుతు న్నారు. ఈ విషయమై కొనుగోలు కేంద్రం ఇన్‌చార్జీ రాథోడ్ శేషరావును ప్రశ్నించగా రైతులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా జొన్న పంట కొనుగోలు చేస్తున్నామని తెలిపారు. కొనుగోలు చేసిన పంట తడవకుండా ఉండడానికి పాలిథీన్ కవర్లు సైతం అందుబాటు లో ఉంచుకున్నామన్నారు.



వడ్యాల్‌లో మాట్లాడుతున్న న్యాయాధికారి రాధిక

రైతులు చట్టాల పట్ల అవగాహన కలిగి ఉండాలి

● న్యాయాధికారి రాధిక

లక్ష్మణచాంద, మే 7 (ఆంధ్రజ్యోతి): రైతులు చట్టాల పట్ల అవగాహన కలిగి ఉండాలని జూనియర్ సివిల్ న్యాయాధికారి రాధిక బుధవారం అన్నారు. జిల్లా న్యాయ సేవా సాధికార సంస్థ ఆధ్వర్యంలో వడ్యాల్ గ్రామంలో గల రైతు వేదిక భవనంలో రైతులకు చట్టాలపై అవగాహన కల్పించారు. రైతులు చట్టాలపై అవగాహన పెంచుకోవాలని, అలాగే రైతులు వారి హక్కులను, విధులను తెలుసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. పలు చట్టాల గురించి వివరించారు.

అలాగే మండలంలోని పొట్టపెల్లిలో గల నర్సరీని జూనియర్ సివిల్ న్యాయాధికారి రాధిక పరిశీలించారు. నర్సరీ మెయింటెనెన్స్ విషయంలో ఎంపీడీవో రాధా రాథోడ్‌ను అభినందించారు. విజిటర్స్ రిజిస్టర్‌లో అభినందిస్తున్నట్లు రాసి సంతకం చేశారు. ఈ కార్య క్రమంలో తహసీల్దార్ జానకి, ఎంపీడీవో రాధా రాథోడ్, ఎస్సై సుప్రియ, న్యాయ వాదులు ఏ. లింగాగౌడ్, డి. రమణ గౌడ్, నాయకులు అట్ల రామ్‌రెడ్డి, నరేష్ రెడ్డి, పొలాస గోవర్ధన్, వడ్యాల్ గ్రామ రైతులు పాల్గొన్నారు.

భావే మహినా ఆదివాసీలకు పవిత్ర మాసం

● ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుపటేల్



కల్లూరుగూడలో నిర్వహించిన ఆదివాసీల పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే

ఉట్నూర్ మే 7 (ఆంధ్రజ్యోతి): ఆదివాసులు అత్యంత భక్తి శ్రద్ధలతో భావే మహినా (మాసం)ను నిర్వహించడం తరతరాలుగా వస్తున్న ఆచారమని ఖానాపూర్ నియోజక వర్గ శాసనసభ్యుడు వెడ్మ బొజ్జుపటేల్ పేర్కొన్నారు. ఉట్నూర్ మండలంలోని కల్లూరుగూడ గ్రామంలో భావే మహినా(మాసం) సందర్భంగా అప్షెకర్ ఆత్రంవారి పూజ కార్యక్రమంలో ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మబొజ్జుపటేల్ కుటుంబ సమేతంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆదివాసులకు పుష్ మహినా (పుష్యమాసం), భావే మహిన(మాసం)చాలా పవిత్రమైనవని అన్నారు. ఇతరుల కంటే బిన్నంగా ఆదివాసుల సంస్కృతి సాంప్రదాయాలు ఉంటాయని, ప్రకృతినే దైవంగా భావించి పూజలు నిర్వహించడం తరతరాలుగా వస్తున్న ఆచారమని అన్నారు. ప్రతీ ఒక్కరు సంస్కృతి సాంప్రదాయాలను కాపాడుతూనే భావితరాలకు అందించాల్సిన బాధ్యత ప్రతీఒక్కరిపై ఉందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అప్షెకర్ ఆత్రం పరివార్, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

కన్నుల పండువగా కన్యకా పరమేశ్వరి మాత జయంతి



ప్రత్యేక పూజలు చేస్తున్న ఆర్యవైశ్య సంఘ భక్తులు

భైంసా, మే 7 (ఆంధ్రజ్యోతి): రెవెన్యూ డివిజన్ కేంద్రమైన భైంసాలోని శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయంలో బుధవారం శ్రీ కన్యకా పరమేశ్వరి మాత జయంతి వేడుకలు కన్నుల పండువగా జరిగాయి. పట్టణ ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో జరిగిన జయంతి వేడుకలకు డివిజన్ పరిధిలోని అన్ని ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. వేడుకలలో భాగంగా కమిటీ సభ్యులు ఆలయాన్ని శోభయమానంగా అలంకరించారు. జయంతి కార్యక్రమంలో భాగంగా మూలమూర్తి అమ్మవారికి, ఉత్సవ మూర్తులకు అభిషేకం,అర్చన, ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించారు. రాత్రి 7 గంటలకు మహిళలచే సాముహిక సహస్ర కుంకుమార్చన జరిగింది. అనంతరం భారీ అన్నదాన కార్యక్రమం జరిగింది. జిల్లా ఆర్యవైశ్య మహాసభ ప్రధాన కార్యదర్శి గుజ్జల్‌వార్ సాయినాథ్, కోశాధికారి దర్బార్ శ్రీశైలం తదితరులు జయంతి వేడుకలలో పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

కొలువు దీరిన కాల్వ దేవస్థాన కొత్త పాలక వర్గం



మాట్లాడుతున్న కేంద్ర మాజీ మంత్రి డాక్టర్ వేణుగోపాల చారి

దిలావర్‌పూర్, మే 7 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కాల్వ లక్ష్మీ నరసింహ స్వామి దేవస్థానం నూతన పాలకవర్గం బుధవారం కొలువుదీరింది. దేవాదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ రంగు రవికిషన్ గౌడ్ నూతన పాలకవర్గ సభ్యుల చేత ప్రమాణ స్వీకారం చేయించారు.

చైర్మన్‌గా అంగూరి మహేందర్

కాల్వ లక్ష్మీ నరసింహ స్వామి దేవస్థానం నూతన చైర్మన్‌గా కాల్వ గ్రామానికి చెందిన అంగూరి మహేందర్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా మహేందర్ మాట్లాడుతూ ఎంతో మంది భక్తుల ఇలవేల్పు కాల్వ లక్ష్మీ నరసింహ స్వామి దేవస్థానం అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. నాపై నమ్మకంతో చైర్మన్‌గా బాధ్యతలను అప్పజెప్పిన డీసీసీ అధ్యక్షుడు శ్రీహరి రావు, కేంద్ర మాజీ మంత్రి డా. వేణుగోపాల చారి, మాజీ మంత్రి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు విద్యాసాగర్ రెడ్డిలకు కృతజ్ఞతలు తెలిపారు.

సమన్వయంతో ఆలయ అభివృద్ధికి కృషి చేయాలి

● కేంద్ర మాజీ మంత్రి వేణుగోపాల చారి

కాల్వ లక్ష్మీ నరసింహ స్వామి నూతన పాలకవర్గ సభ్యులు అధికారులను సమన్వయం చేసుకుంటూ ఆలయ అభివృద్ధికి కృషి చేయాలని కేంద్ర మాజీ మంత్రి డా.వేణుగోపాల చారి అన్నారు. నూతన పాలకవర్గ ప్రమాణ స్వీకారోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎంతో మంది భక్తుల ఆరాధ్య దైవమైన కాల్వ లక్ష్మీ నరసింహ స్వామికి ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోనే కాకుండా రాష్ట్ర వ్యాప్తంగా భక్తులున్నారన్నారు. ఆలయ అభివృద్ధికి పాలకవర్గం సభ్యులకు అన్ని విధాల సహకరిస్తామని వేణుగోపాల చారి అన్నారు. నూతన పాలక వర్గ సభ్యులను శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో దేవాదాయ శాఖ అధికారులు భూమయ్య, మనోహర్, భక్తులు పాల్గొన్నారు.

భూదాతలు సహకరిస్తేనే సుర్జాపూర్‌కు రోడ్డు ఏర్పాటు



రోడ్డు వసతి లేని సుర్జాపూర్ గ్రామం

బోథ్, మే 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పాట్నాపూర్ గ్రామపంచాయతీ పరిధిలో ఉన్న సుర్జాపూర్ గ్రామానికి రోడ్డు వసతి లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. అయితే ఈ విషయాన్ని అధికారులకు గ్రామస్థులు విన్నవించడంతో మంగళవారం గ్రామానికి వెళ్లిన తహసీల్దార్ గ్రామస్తులతో చర్చించి రోడ్డు ఏర్పాటుకు చర్యలు చేపట్టారు. దీంతో గ్రామస్తులు రోడ్డు పూర్తవుతుందని అనుకున్నారు.

● నిధులు మంజూరైనా..

గ్రామానికి రోడ్డు వసతి కోసం మూడు దఫాలుగా నిధులు మంజూరయ్యాయి. అయితే గ్రామానికి వెళ్లేందుకు పంట చేన్లలో నుండి రోడ్డు ఏర్పాటు కావాల్సి ఉండడంతో రోడ్డు కోసం భూదాతలు ఎవరు ముందుకు రాలేదు. దీంతో నిధులు మంజూరు అయిన రోడ్డు మాత్రం ఏర్పాటు కాలేదు. వర్షాకాలంలో తమకు ఇబ్బందులు తప్పవని గ్రామస్తులు అనుకుంటున్న సమయంలో తహసీల్దార్ తర్వాత రోడ్డు ఏర్పాటు కోసం చర్యలు చేపట్టారు. మొదట భూ దాతలు ముందుకు వచ్చినట్లు వచ్చి తిరిగి భూమిని ఇచ్చేందుకు ముందుకు రాకపోవడంతో సమస్యలపై మొదటికే వచ్చిందని వాపోతున్నారు.

● భూ దాతలు సహకరించండి

దశాబ్దాల క్రితం వెలసిన మా గ్రామానికి రోడ్డు వసతి కల్పించేందుకు భూదాతలు సహకరించాలని ఆ గ్రామ గిరిజనులు కోరుతున్నారు. తమ గ్రామ ప్రజల కోరిక మేరకు భూ దానం చేయాలని భూముల యజమానులు కోరుతున్నారు. దాతలు సహకరిస్తే రోడ్డు ఏర్పాటు అవుతుందని లేకుంటే తమ గతి గతంలో లాగే ఉంటుందని అంటున్నారు. పెద్ద మనసుతో దాతలు రోడ్డు కోసం భూమిని ఇవ్వాలని కోరుతున్నారు.

కన్నుల పండువగా వేంకటేశ్వర స్వామి కల్యాణోత్సవం



గూడ కుంకుమార్చనలో పాల్గొన్న మహిళలు



గూడ వేంకటేశ్వర కల్యాణోత్సవంలో పాల్గొన్న మహిళలు

జైనథ్, మే7 (ఆంధ్రజ్యోతి): జైనథ్ ఉమ్మడి మండలంలోని బోరజ్ పరిధిలో గల గూడ గ్రామంలో గల వేంకటేశ్వర ఆలయంలో స్వామి వారి ద్వితీయ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. బుధవారం ఆలయాన్ని వివిధ రంగుల పూలతో పాటు వివిధ రంగులతో కూడిన విద్యుత్ మెర్క్యూరి బల్బులతో అలంకరించారు. శ్రీవెంకటేశ్వర స్వామి కళ్యాణాన్ని పురస్కరించుకుని ఆలయంలో నిత్యహోమం, యజ్ఞ, అభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధాన అర్చకులు చికిలి అగస్త్యశాస్త్రి ఘనపాటి విశిష్ట శాస్త్రీ అర్చకుల బృందం ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించి వేంకటేశ్వర లక్ష్మీ సతీ సమేతంగా వేద మంత్రోచ్ఛరణ మధ్య కళ్యాణం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీ పీ గోవర్ధన్, గూడ గ్రామ మాజీ ఎంపీటీసీ తోట రమరమేష్, మాజీ సర్పంచ్ రమేష్, ఎంపీటీసీ కిసాన్ అన్నపూర్ణ, ఆదిలాబాద్ మాజీ మున్సిపల్ చైర్మన్ రంగినేని మనిషా పవన్‌రావు, శ్రీపతిరావుతో పాటు గూడ గ్రామస్థులు, ఆయా గ్రామల ప్రజలు, మహిళలు, భక్తులు పాల్గొన్నారు.

నిర్వహణ లేక నిరుపయోగం

● ఆర్టీసీ బస్టాండ్‌లో ఫీడింగ్ సెంటర్ అస్తవ్యస్తం



నిరుపయోగంగా ఉన్న ఫీడింగ్ సెంటర్

తల్లులు తమ పసిపిల్లలకు సౌకర్యవంతంగా పాలు పట్టించేందుకు వీలుగా ఆదిలాబాద్ ఆర్టీసీ బస్టాండ్‌లో ఏర్పాటు చేసిన తల్లిపాల కేంద్రాలు నిర్వహణ సరిగాలేక అస్తవ్యస్తంగా మారాయి. నిరుపయోగంగా దర్శనమిస్తున్నాయి. దీంతో దూర ప్రయాణాలు చేసే తల్లులు అందరి ముందు బహిరంగంగా చంటి పిల్లలకు ఫీడింగ్ ఇవ్వడానికి చాలా ఇబ్బందులు పడుతున్న పరిస్థితులు నెలకొన్నాయి. ఇకనైనా సంబంధిత అధికారులు ప్రత్యేక దృష్టి సారించి మళ్లీ వాటిని వినియోగంలోకి తీసుకురావాలని పలు వురు కోరుతున్నారు.

● (ఆంధ్రజ్యోతి, ఆదిలాబాద్ స్టాఫ్ ఫొటోగ్రాఫర్)



ఆదిలాబాద్ మార్కెట్ యార్డులో కుప్పలుగా పోసిన జొన్న





పంట కుప్పల మీదనే కునుకు తీస్తున్న రైతులు



పడిగాపులు కాస్తూ అక్కడే తింటున్న రైతులు

పంట అమ్మకానికి పడిగాపులు

● జొన్న కుప్పల వద్దనే అన్నదాతల కునికి పాట్లు



ఆరుగాలం కష్టించి పండించిన పంటను అమ్ముకోవడానికి సైతం రైతులు అపాసోపాలు పడాల్సి వస్తుంది. పంట కుప్పల వద్దనే రాత్రంతా జాగారాం చేయాల్సిన దుస్థితి దాపురించింది. ఈ పరిస్థితి ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్‌యార్డులో నెలకొంది. ఇటీవల జొన్న పంట చేతికి రావడంతో చాలా మంది రైతులు అమ్మకానికి తెచ్చారు. పంట నిల్వలు ఎక్కువ కావడం కొనుగోళ్ల వేగవంతం చేయక పోవడంతో రైతులకు అవస్థలు తప్పడం లేదు.దీంతో అక్కడే పడిగాపులు కాస్తూ కునికి పాట్లు తీయాల్సిన పరిస్థితి ఏర్పడింది.

● (ఆంధ్రజ్యోతి, ఆదిలాబాద్ స్టాఫ్ ఫొటోగ్రాఫర్)



మార్కెట్ యార్డులో ఉన్న జొన్న

ఆంధ్రజ్యోతి

andhrajyothy.com

బుధవారం ఉష్ణోగ్రత గరిష్ఠం 40.3। కనిష్ఠం 25.7



ఆదిలాబాద్
జిల్లా వార్తలు

5

గురువారం 8 మే 2025



● ఆదిలాబాద్ మార్కెట్‌లో పత్తిని కొనుగోలు చేస్తున్న దృశ్యం(ఫైల్)

అంతా గోల్‌మాల్.. దందా

- జిల్లాలో సీసీఐ పత్తి కొనుగోళ్లలో భారీగా అక్రమాలు
- వ్యవసాయ, మార్కెటింగ్ శాఖల పొంతనలేని లెక్కలు
- ఇద్దరు అధికారుల సస్పెన్షన్.. నలుగురికి మెమోలు జారీ
- పలు ప్రైవేట్ జిన్నింగ్ మిల్లుల లావాదేవీలపైనా ఆరా
- పత్తి అక్రమ కొనుగోళ్లపై మొదలైన రాజకీయ రగడ
- త్వరలోనే జిల్లాలో కేంద్ర నిఘా విభాగం అధికారుల దర్యాప్తు

ఆదిలాబాద్, మే 7(ఆంధ్రజ్యోతి): ఈ యేడు పత్తి కొనుగోళ్లలో భారీ అక్రమాలు జరిగినట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. అధికారులు, ప్రైవేట్ వ్యాపారులతో కుమ్మక్కై గోల్‌మాల్ దందాకు తెరలేపినట్లు తెలుస్తుంది. జిల్లాలో జరిగిన పత్తి కొనుగోళ్ల అక్రమాలపై రాష్ట్ర ప్రభుత్వం సీరియస్‌గా దృష్టి సారించింది. ఇప్పటికే ప్రభుత్వం విజిలెన్స్ విచారణకు ఆదేశించింది. ఇటీవల జిల్లాలో పర్యటించిన విజిలెన్స్ అధికారుల బృందం మార్కెటింగ్ అధికారులతో పాటు సీసీఐ అధికారులను రహస్యంగా విచారించినట్లు తెలుస్తుంది. ప్రైవేట్ వ్యాపారులతో కొందరు అధికారులు చేతులు కలిపి గోల్‌మాల్ దందాకు తెరలేపినట్లు విజిలెన్స్ విచారణలో తేలిం ది. దీంతో త్వరలోనే మరికొంత మంది అధికారులపై వేటువేసే అవకాశం ఉందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. జిల్లాలో ప్రధానంగా సాగు చేసే పత్తి పంట ఈయేడు 4 లక్షల 36వేల 473 ఎకరాలలో సాగైనట్లు వ్యవసాయ శాఖ అధికారుల లెక్కల ప్రకారం తెలుస్తుంది. దీంతో సుమారుగా 30 లక్షల క్వింటాళ్ల వరకు దిగుబడులు వస్తాయని అధికారులు అంచనా వేశారు. కానీ అధికారుల లెక్కలు తలకిందులయ్యే విధంగా పత్తి కొనుగోళ్లను జరపడంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. మార్చి 26 వరకు సీసీఐ, ప్రైవేట్ ఆధ్వర్యంలో 27 లక్షల 70 వేల 136 క్వింటాళ్ల పత్తిని కొనుగోలు చేశారు. కానీ అధికారులు మాత్రం 27,77,352 క్వింటాళ్ల ను కొనుగోళు చేసినట్లు లెక్కలు చెబుతున్నారు. దీంతో పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. జిల్లాలో జరిగిన సీసీఐ పత్తి కొనుగోళ్లపై రాజకీయ రగడ మొదలయ్యింది. ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల శంకర్, మాజీ మంత్రి జోగు రామన్నలు ఇద్దరు పత్తి కొనుగోళ్లలో జరిగిన అక్రమాలపై తీవ్ర విమర్శలకు దిగడం ప్రస్తుతం జిల్లాలో హాట్ టాపిక్‌గా మారింది. అలాగే పత్తి కొనుగోళ్ల అక్రమాలపై త్వరలోనే కేంద్ర నిఘా విభాగం అధికారులు కూడా విచారణ జరిపే అవకాశం ఉన్నట్లు తెలుస్తుంది.



● ..పత్తిని తూకం వేస్తున్న అధికారులు(ఫైల్)

పొంతనలేని లెక్కలు


పత్తి కొనుగోళ్లపై వ్యవసాయ శాఖ, మార్కెటింగ్ శాఖ అధికారులు పొంతనలేని సమాధానాలు చెప్పడంతో అంతా గందరగోళంగా మారుతుంది. వ్యవసాయ శాఖ లెక్కల ప్రకారం జిల్లాలో 2024-25 ఖరీఫ్ సీజన్‌లో లక్షా 40వేల 488 మంది పత్తి రైతులు ఉన్నట్లు చెబుతున్నారు. కానీ మార్కెటింగ్ శాఖ లెక్కల ప్రకారం లక్షా 51వేల 118మంది రైతులు ప్రైవేట్, సీసీఐకి పత్తిని విక్రయించినట్లు స్పష్టమవుతుంది. అలాగే జిల్లావ్యాప్తంగా మరో 6,353 మందికి టీఆర్ సర్టిఫికెట్లను జారీ చేసి పత్తిని కొనుగోలు చేయడంతో పత్తి రైతుల సంఖ్య లక్షా 57వేల 471కి చేరింది. అంటే వ్యవసాయ శాఖ చెప్పే లెక్కలకు, మార్కెటింగ్ శాఖ వద్ద ఉన్న రైతుల లెక్కలకు ఏమాత్రం పొంతన లేకుండానే పోయింది. ఉన్నట్టుండి 16,983 మంది రైతులు ఏవిధంగా పెరిగారో మార్కెటింగ్ శాఖ అధికారులకే తెలియాలి. దీన్ని బట్టి చూస్తుంటే ఏస్థాయిలో అక్రమాలు జరిగాయో తెలుస్తునే ఉంది. పంట దిగుబడి అంచనాలు కూడా తారుమారు కావడం అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనంగా కనిపిస్తుంది. పంటల సర్వే, ఆన్‌లైన్ నమోదు ప్రక్రియ అంతా అడ్డగోలుగానే జరుగుతుందన్న ఆరోపణలు వస్తున్నాయి.

వేటు వేశారు.. వదిలేశారు

పత్తి కొనుగోళ్లలో అక్రమాలు జరిగినట్లు గుర్తించిన ఉన్నతాధికారులు ఇద్దరు అధికారులపై సస్పెన్షన్ వేటు వేసి వదిలేశారు. ఆదిలాబాద్ మార్కెటింగ్ పరిధిలో అక్రమాలకు పాల్పడినట్లు గుర్తించి మార్కెటింగ్ సెక్రెటరీ మధుకర్‌పై ఫిబ్రవరి 10న సస్పెన్షన్ వేటు వేశారు. ఆ తర్వాత విచారణ ముందుకు సాగడం లేదు. ఆయనతో పాటు మరో ఇద్దరు ముగ్గురు అధికారులకు కూడా హస్తం ఉన్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. లోతుగా దర్యాప్తు జరిపితే ఓ జిల్లాస్థాయి అధికారితో పాటు మరికొంత మంది సిబ్బందిపై వేటు పడే అవకాశం ఉంటుంది. జిల్లావ్యాప్తంగా 6,353 టీఆర్‌లను జారీ చేయగా ఇందులో ఆదిలాబాద్ మార్కెట్ పరిధిలోనే అత్యధికంగా 3456 టీఆర్‌లను వ్యవసాయ శాఖ అధికారులు జారీ చేశారు. ఇందులోను కొంతమంది వ్యవసాయ శాఖ అధికారుల పాత్ర ఉన్నట్లు ఫిర్యాదులు వస్తున్నాయి. దీనిపై ప్రత్యేకంగా దర్యాప్తు జరపాల్సిన అవసరం ఉంది. అలాగే ఇచ్చోడ వ్యవసాయ శాఖ అధికారిపై కూడా సస్పెన్షన్ వేటు పడింది. ఇక్కడ కూడా మార్కెటింగ్ అధికారులు అక్రమాలకు పాల్పడ్డారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. దీంతో గత నాలుగైదు రోజుల క్రితం బోథ్, జైనథ్, ఇంద్రవెల్లి, ఇచ్చోడ మార్కెటింగ్ కార్యదర్శులకు ఉన్నతాధికారులు నోటీసులు జారీ చేశారు. వీరి ప్రమేయంపై కూడా రహస్యంగా దర్యాప్తు జరుగుతున్నట్లు తెలుస్తుంది.

నేతల ప్రమేయంపై ఆరోపణలు?

పత్తి కొనుగోళ్ల అక్రమాలతో కొంత మంది నేతలకు ప్రమేయం ఉన్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. గత రెండు మూడు రోజులుగా నేతలు తీవ్ర విమర్శలు చేసుకోవడం రాజకీయ రగడకు దారి తీస్తుంది. పత్తి కొనుగోళ్లలో జరిగిన అక్రమాలతో సంబంధం ఉన్నట్లు విమర్శలు చేసుకోవడం జిల్లాలో చర్చనీయాంశంగా మారింది. ప్రధానంగా మాజీ మంత్రి జోగు రామన్న ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల శంకర్‌ను టార్గెట్ చేస్తూ



(తరువాయి 6వ పేజీలో...)



ఆదిలాబాద్‌లో సంబరాలు జరుపుకుంటున్న సనాతన హిందూ ఉత్సవ సమితి సభ్యులు, మాజీ ఆర్మీ జవాన్లు



ఉట్నూర్‌లో వాహనాలను తనిఖీ చేస్తున్న పోలీసులు

ఆపరేషన్ సిందూర్ పేరిట మెరుపు దాడులను హర్షిస్తూ సంబరాలు

ఆదిలాబాద్ రూరల్, మే 7(ఆంధ్రజ్యోతి): ఉగ్రస్థావరాలపై భారత సైన్యం ఆపరేషన్ సిందూర్ పేరిట మెరుపుదాడులను హర్షిస్తూ జిల్లాలో సనాతన హిందూ ఉత్సవ సమితి అధ్యక్షుడు ప్రమోద్ కుమార్ ఆధ్వర్యంలో సంబరాలు చేసుకున్నారు. వినాయక్ చౌక్‌లో టపాసులు కాల్చారు. పాకిస్థాన్ వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఉగ్రవాదాన్ని అంతం చేయడానికి ప్రపంచ దేశాలు భారతకు మద్దతు పలుకుతున్నాయని మఠాధిపతి యోగానంద సరస్వతి తెలిపారు. మాజీ ఆర్మీ జవాన్‌లు పాల్గొన్నారు.

● **ఉట్నూర్‌లో పోలీసుల తనిఖీలు**

ఉట్నూర: పాకిస్థాన్‌పై భారత్ చేపట్టిన ఆపరేషన్ సిందూర్ నేపథ్యంలో బుధవారం పోలీసులు ఉట్నూర్ మండలంలో వాహనాల తనిఖీ నిర్వహించారు. ఇరుదేశాల మధ్య ఉద్రిక్తతలు నెలకొన్న సందర్భంగా ఎలాంటి అలజడులు జరగకుండా ఉండడానికి వాహనాలు తనిఖీ నిర్వహిస్తున్నామని ఉట్నూర్ సబ్ ఇన్‌స్పెక్టర్ మనోహర్ తెలిపారు. ఉట్నూర్ ఆదిలాబాద్, మంచిర్యాల, ఉట్నూర్ మధ్య రాకపోకలు సాగిస్తున్న వాహనాలను నిలిపి పోలీసులు తనిఖీలు నిర్వహించారు.



మేడిగూడ(ఆర్)లో జ్ఞానేశ్వరి పారాయణం చేస్తున్న భక్తులు

కొనసాగుతున్న సప్తాహం వేడుకలు

జైనత్, మే 7(ఆంధ్రజ్యోతి): జైనథ్ ఉమ్మడి మండలంలోని సాత్నాల పరిధిలోని మేడిగూడ ఆర్‌లో గత వారం రోజులుగా సద్గురు బాజీరావ్ బాబా సప్తాహం వేడుకలు కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా బుధవారం జ్ఞానేశ్వరి పారాయణం గీతాపాట్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా బాజీరావ్ బాబా చిత్రపటానికి పూలమాలలు వేసి పూజలు నిర్వహించారు. దీంతో పాటు దత్తమందిరంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వీడీసీ చైర్మన్ కె.రాంరెడ్డి, భక్తులు భీం మహర్షి, నాందేవ్, పండరినాథ్, కడ్‌సి జైపాల్, బోయర్ గులాబ్, దిలీప్ బోయర్, ఎస్.దినకర్, రాంకృష్ణకడ్‌సే, శ్రీరాంపూర్ తానాజిలతో పాటు మేడిగూడ గ్రామ ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.



నార్నూర్‌లో ధర్నా చేస్తున్న బీజేపీ నాయకులు

'ఇందిరమ్మ కమిటీ' పెత్తనం ఏంటి?

● **ప్రభుత్వం సర్వే చేసి పేదలకు ఇళ్లు ఇవ్వాలి : బీజేపీ**

నార్నూర్, మే 7(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం అర్హులైన పేద వారికి అధికారుల ద్వారా సర్వే చేసి ఇళ్ల మంజూరు చేయాలి, కానీ కార్యకర్తలను కమిటీ పేరుతో నియమించి పెత్తనం నడిపించడం ఏంటి? అంటూ బుధవారం మండలకేంద్రంలో బీజేపీ నాయకులు పెద్దఎత్తున్న ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ మండల అధ్యక్షుడు బిక్కు రాథోడ్ మాట్లాడుతూ నార్నూర్ గ్రామ పంచాయతీ పరిధిలో చాలా మంది పేద వారు ఉన్నారని, ఇప్పటికీ వారికి ఉండడానికి ఇళ్లు లేవన్నారు. ప్రభుత్వం నియమించిన ఇందిరమ్మ కమిటీ అనే పేరుతో కార్యకర్తలను నియమించి పేదవారికి ఇళ్లు రాకుండా వారు కుటుంబ సభ్యులకు, చట్టాలకు బినామీ రూపంలో మంజూరు సిఫార్సు చేస్తున్నారని ఆరోపించారు. కమిటీ సభ్యులు, అధికారులు కుమ్మక్కు అయ్యారని, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు, భూములు ఉన్న ఎస్సీ, ఎస్టీతో పాటు మహారాష్ట్ర నుంచి వచ్చిన బీసీ మైనార్టీలకు మంజూరు చేయడంపై తీవ్ర అభ్యంతరాలు వ్యక్తం చేశారు. ఐకేపీ, కేజీబీవీ ప్రభుత్వ సంస్థలో ఉద్యోగం పేరుతో పని చేస్తున్న వారికి మంజూరు చేయడం ఏంటిదని ప్రశ్నించారు. షేక్ అమీనా షేక్ సద్దాం పేరు డిలీట్ చేసి మహారాష్ట్ర వాసికి ఎలా ఇస్తారు? అని నిలదీశారు. గ్రామ పంచాయతీలో గ్రామసభ ఏర్పాటు చేసి అర్హులైన పేద వారికి ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం గ్రామ పంచాయతీ ముందర అర్ధనగ్న ప్రదర్శన చేస్తూ ప్రభుత్వానికి, అధికారులకు వ్యతిరేకమగా నినాదాలు చేశారు. విషయం తెలుసుకున్న సీఐ రహీం పాషా ఆందోళన చేస్తున్న నాయకులను విరమింప చేశారు. ఈ కార్యక్రమంలోబీజేపీ జిల్లా కార్యవర్గ సభ్యుడు చలురకర్ ప్రకాష్, జాదవ్ మహేందర్, హనుమంతు, జీవడే, మోహన రాజు, సద్దాం, తదితరులు పాల్గొన్నారు.

కళాకారులకు టూల్ కిట్స్ పంపిణీ

ఉట్నూర్, మే 7(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని డొక్రాక్రాఫ్ట్ (ఇత్తడి బొమ్మల తయారీదారులు) గిరిజన కళాకారుల యొక్క కళాకాండాలను(ఇత్తడి బొమ్మలు) తుది మెరుగులు దిద్దేందుకు కావాల్సిన యంత్రాలను, టోల్ కిట్లను ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి ఖుష్బుగుప్తా బుధవారం ప్రాజెక్టు అధికారి చాంబర్‌లో పంపిణీ చేశారు. ఇటీవల వారి కళాఖండాలను మార్కెటింగ్ చేసే క్రమంలో ఎఫ్ఐసీసీఐ ఎఫ్ఎల్‌వో అనే సంస్థ ద్వారా ఒప్పందం కుదుర్చుకునే సమయంలో కళాకారులు వారి యొక్క కళాఖండాలు తుది మెరుగులు దిద్దడానికి కొన్నిరకాల టూల్ కిట్లు యంత్రాలు అవసరమవుతాయని తెలిపారు. ఈ మేరకు పీవో ఐటీడీఏ ద్వారా అందజేశారు. గిరిజన కళాకారులు తయారు చేసిన వస్తువులను తాము కూడా ఐటీడీఏ ద్వారా కొనుగోలు చేస్తామన్నారు.

నేడు విత్తన డీలర్లతో సమావేశం

బోథ్, మే 7 (ఆంధ్రజ్యోతి): బోథ్, సోనాల మండలాల ఎరువులు విత్తనాల డీలర్‌లతో సమావేశాన్ని ఈనెల 8న గురువారం నిర్వహించనున్నట్లు మండల వ్యవసాయ అధికారి తెలిపారు. రైతు వేదికలో నిర్వహించే సమావేశానికి డీలర్లు ఉదయం 10.30 గంటలకు హాజరు కావాలని కోరారు.

.. పంటల సాగుపై అవగాహన

బోథ్: వర్షాకాలం పంటల సాగు విషయంలో రైతులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందని మండల వ్యవసాయ అధికారి తెలిపారు. రైతు ముంగిట శాస్త్రవేత్తల కార్యక్రమం గురువారం ఉదయం పాట్నాపూర్‌లోని రైతు వేదికలో 8.45 గంటలకు ప్రారంభమవుతుందన్నారు. రైతుల ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ప్రభుత్వ ఆసుపత్రిలో సికిల్ సెల్ పరీక్షలు

నేరడిగొండ, మే 7(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమిక ఆసుపత్రిలో బుధవారం సికిల్ సెల్ పరీక్షలు చేశారు. ఈ సందర్భంగా హెచ్ఈవో పవార్ రవీందర్ ప్రజలకు సికిల్ సెల్ వ్యాధిపై అవగాహన కల్పించారు. 40 ఏళ్ల లోపు ఉన్న ఎస్టీ కులానికి చెందిన వారికి పరీక్షలు చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య పర్యవేక్షకుడు సంతోష్, హెచ్‌పీ శ్రీనివాస్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

గ్రామీణ బంద్‌ను జయప్రదం చేయాలి

ఆదిలాబాద్ అర్బన్, మే 7(ఆంధ్రజ్యోతి): కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ అనుసరిస్తున్న కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలకు కేంద్ర కార్మిక సంఘాలు, సంయుక్త కిసాన్ మోర్చా పిలుపు మేరకు మే 20న సార్వత్రిక సమ్మె గ్రామీణ బంద్‌ను విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి అన్నమొల్ల కిరణ్ కోరారు. బుధవారం సీఐటీయూ కార్యాలయంలో మే 20న జరిగే కార్మిక సార్వత్రిక సమ్మె గ్రామీణ బంద్‌పై ప్రజా సంఘాల ఆధ్వర్యంలో రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కిరణ్ మాట్లాడుతూ కార్పొరేట్ సంస్థలకు అనుకూలంగా నాలుగు లేబర్ కోడ్‌లను తీసుకువచ్చిందన్నారు. ఇందులో ప్రజా సంఘాల నాయకులు సచిన్, ఆశన్న, సక్కు, సురేందర్, అగ్గిమల్ల స్వామి, నగేష్, ఆర్ మంజుల, తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన విద్యుత్ వారోత్సవాలు

ఆదిలాబాద్ అర్బన్, మే 7 (ఆంధ్రజ్యోతి): లక్ష్యంతో ప్రతి ఒక్కరు పని చేయాలని విద్యుత్ శాఖ చీఫ్ ఇంజనీర్ జేఆర్ చౌహాన్ అన్నారు. మే 1 నుంచి చేపట్టిన విద్యుత్ వారోత్సవాలు బుధవారం ముగిశాయి. ఈ సందర్భంగా ఎస్ఈ కార్యాలయంలో విద్యుత్ శాఖ ఉద్యోగులతో సమావేశం నిర్వహించారు. అనంతరం విద్యుత్ ప్రమాదాల నివారణకు చేపట్టాల్సిన అంశాలు, ట్రోల్‌ఫ్రి నంబర్లు, సేవలతో కూడిన పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా చౌహాన్ మాట్లాడుతూ మే1 నుంచి 7 వరకు విద్యుత్ వారోత్సవాలను నిర్వహించామన్నారు. ఆదిలాబాద్ సర్కిల్‌లోని అన్ని డివిజన్లలో విద్యుత్ సేవలపై అవగాహన కల్పించామన్నారు. ఇందులో డీఈ, సుభాష్, గోపి, ఏఈ శ్రీనివాస్, ఏడీ లక్ష్మణ్, ఏఈలు, లైన్‌మన్‌లు పాల్గొన్నారు.



ఇచ్చోడలో మొదటి జాబితా లబ్ధిదారుల గృహాలను పరిశీలిస్తున్న కలెక్టర్



శంభుగూడలో కళలను ప్రదర్శిస్తున్న కళాకారులు

నిబంధనల మేరకు అర్హులకు ఇళ్లు

● జిల్లా కలెక్టర్ రాజర్షి షా ● ఇచ్చోడలో లబ్ధిదారుల జాబితా పరిశీలన ● శంభుగూడలో గుస్సాడీ కార్యశాల ముగింపు ఉత్సవాలకు హాజరు

ఇచ్చోడ, మే 7(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ నిబంధనల మేరకు అర్హులకు ఇందిరమ్మ ఇళ్లు కేటాయించాలని కలెక్టర్ రాజర్షి షా ఇచ్చోడ మండల అధికారులను ఆదేశించారు. బుధవారం ఇచ్చోడ మండల కేంద్రంలో ఇందిరమ్మ ఇళ్ల జాబితాలో ఉన్న లబ్దిదారుల చెక్‌లిస్ట్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించిన మొదటి విడతలో ఉన్న పేర్లను మరోసారి వెరిఫికేషన్ చేసి, అన్ని కోణాల్లో పరిశీలించి లబ్ధిదారుల బాజితాను తయారుచేయాలని కలెక్టర్ ఈ సందర్భంగా పేర్కొన్నారు. అర్హులైనప్పటికీ జాబితాలో కొందరి పేర్లు లేకపోవడంతో లబ్ధిదారులు కలెక్టర్‌కు విన్నవించగా అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇళ్లు తప్పనిసరిగా వస్తాయన్నారు. ఇచ్చోడలోని మొదటి విడతలో పేర్లు వచ్చిన లబ్ధిదారులతో మాట్లాడారు. ఆర్‌సీసీ స్లాబ్ చూపిస్తు దరఖాస్తులను కుటుంబంతో కలిసి 60 ఏళ్లు పైబడి ఉన్నట్లయితే వాటిని ధృవీకరించాలని అలాంటివాటిని ఇళ్ల మంజూరుకు పరిగణించవచ్చని అర్హులను గుర్తిస్తే ప్రతిపాదనల్లో చేర్చాలని అధికారులకు సూచించారు. అనంతరం తహసీల్దార్, ఎంపీడీఓ కార్యాలయాలను సందర్శించి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో జడ్పీ సీఈవో జితేందర్ రెడ్డి, తహసీల్దార్ సత్యనారాయణ, ఎంపీడీవో లక్ష్మణ్, పంచాయతీ కార్యదర్శి సురేష్, సూర్యప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

● **ఆదివాసీలు కళలను కాపాడుకోవాలి**

గుడిహత్నూర్: ఆదివాసీల తమ సంప్రదాయ కళలను కాపాడుకోవాలని జిల్లా కలెక్టర్ రాజర్షిషా అన్నారు. మండలంలోని శంభుగూడలో నిర్వహించిన తెలంగాణ ప్రభుత్వం బాషా సాంస్కృతిక శాఖ, ఆదివాసీ సకల కళ సంక్షేమ సంఘం సంయుక్త ఆధ్వర్యంలో ఆదివాసీ కళల పరిరక్షణలో భాగంగా గుస్సాడీ కార్యశాల ముగింపు ఉత్సవాల్లో బుధవారం జిల్లా కలెక్టర్, ఎస్పీలు ముఖ్య అతిథులుగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేశారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ఆదివాసీ కళలను ప్రోత్సహించడానికి రాష్ట్ర ప్రభుత్వం ఎంతో కృషి చేస్తుందన్నారు. గుస్సాడీ గురించి మీ అందరికి తెలిసిందే అన్నారు. ఉమ్మడి జిల్లా నుంచి గుస్సాడీ కళాకారుడు కానక రాజుకు జాతీయ స్థాయిలో పద్మశ్రీ అవార్డు రావడం జరిగిందని వారు ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఆదివాసీ కళలైన కిక్రి, రెలాతో పాటు మరికొన్ని కళలు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు రావాలంటే ప్రతీఒక్క వేదికలో కళాకారులకు అవకాశం రావాలన్నారు. విదేశాల్లో కూడా తమ ప్రతిభ కనబర్చాలన్నారు. అంతేకాకుండా స్వాతంత్ర్య దినోత్సవం, గణతంత్ర దినోత్సవ వేడుకల్లో ఆదివాసీ కళలకు అవకాశం కల్పించామన్నారు. ఇలాంటి వేదికలు యువతకు ఆదివాసీ సంస్కృతీ, సంప్రదాయాలు ఎంతో ఉపయోగపడుతుందని, ఇలాంటి కార్యక్రమాలు చేసుకోవడానికి ఇచ్చోడలో ప్రభుత్వ భూమి ఉంటే కళాశాల కోసం కేటాయిస్తామన్నారు అనంతరం ఎస్పీ అఖిల్ మహాజన్ మాట్లాడుతూ ఆదివాసీల సంస్కృతీ సంప్రదాయాలు ఎంతో గొప్పవని, తల్లి దండ్రులు సంప్రదాయలను తమ పిల్లలకు తెలియజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో అబ్దుల్‌హై, డిప్యూటీ తహసీల్దార్ భాగ్యలక్ష్మి, ఆదివాసీ సంక్షేమ సంఘం సభ్యులు కళాకారులు పాల్గొన్నారు.

● **ప్రతీ రైతు భూ సమస్యను పరిష్కరించాలి**

జైనథ్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న భూభారతి రెవెన్యూ సదస్సులో ప్రతీ రైతు పెట్టుకున్న భూ సమస్య అర్జిని పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ రాజార్షిషా అన్నారు. బుధవారం బోరజ్ మండలంలోని బాలాపూర్ గ్రామంలో నిర్వహించిన భూభారతి రెవెన్యూ సదస్సుకు హాజరై మాట్లాడారు. రైతులు పెట్టుకున్న భూ సమస్యలను పరిష్కరించేందుకు ఈ భూభారతి చట్టాన్ని ప్రభుత్వం తీసుకువచ్చిందని కలెక్టర్ ఈ సందర్భంగా పేర్కొన్నారు. జైనథ్ మండలంలోని ఆయా గ్రామాల రైతులు ఈ రెవెన్యూ సదస్సులను వినియోగించుకుని తమ భూ సమస్యలను పరిష్కరించుకోవాలని కలెక్టర్ కోరారు. ఈ కార్యక్రమంలో ఆదిలాబాద్ జిల్లా సంయుక్త కలెక్టర్ శ్యామలదేవి, ఆదిలాబాద్ ఆర్డీవో వినోద్‌కుమార్, బోరజ్ మండల తహసీల్దార్ రాథోడ్ రాజేశ్వరి, ఎంపీడీవో వేణులతో పాటు బాలాపూర్ గ్రామ రైతులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య రాకుండా చూస్తాం

● మండల ప్రత్యేక అధికారి ఫణీంధర్
● నిజాంగూడను సందర్శించిన అధికారులు
● మండలస్థాయి అధికారులతో తాగునీటిపై సమీక్ష

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

సిరికొండ, మే 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్రతీ గ్రామంలో తాగునీటి సమస్య రాకుండా చర్యలు చేపడతామని మండల ప్రత్యేకాధికారి ఫణీంధర్ అన్నారు. బుధవారం 'ఆంధ్రజ్యోతి'లో 'పల్లె కన్నీరు' శీర్షికన ప్రచురితమైన కథనానికి కలెక్టర్ స్పందించి ఆరా తీశారు. దీంతో ఆయన ఆదేశాలు మేరకు మండల స్థాయి అధికారులతో కలిసి ప్రత్యేకాధికారి మల్లాపూర్ గ్రామ పంచాయతీ పరిధిలోని నిజాంగూడ గ్రామాన్ని సందర్శించి ఆదివాసీ గిరిజనులకు తాగునీటి కోసం ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేశారు. ఈ సందర్భంగా గ్రామంలో భూగర్భ జలాలు అడుగంటిపోవడంతో తాగునీటి కోసం తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నామని గ్రామస్థులు అధికారులకు విన్నవించారు. మిషన్ భగీరథ నీరు 15 రోజులకు ఒకసారి వచ్చినా అవి తాగడానికి ఉపయోగకరం లేదని వారితో తెలిపారు. భూగర్భ జలాలు అడుగంటిపోవడంతో ప్రతీ రోజూ గ్రామస్థుల దాహార్తిని తీర్చే మంచినీటి బావిలో మట్టి పేరుకుపోవడంతో తాగడానికి, బయటి అవసరాలకు సరిపడా నీరు అందడం లేదన్నారు. దీంతో బావిలో పూడికమట్టిని తొలగించేందుకు నానా ఇబ్బందులకు గురవుతున్నామని అధికారులతో తమ ఆవేదనను వ్యక్తం చేశారు. దీంతో అధికారులు గ్రామస్థులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి, గ్రామంలో ఇక నుంచి తాగునీటి సమస్య రాకుండా అధికారులతో మాట్లాడి తక్షణమే చర్యలు చేపడతామని వారికి హామీ ఇచ్చారు. ఇదే విషయమై మిషన్ భగీరథ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. మిషన్ భగీరథ ద్వారా మంచినీటిని అందించడంతో పాటు ఇంటింటికీ కుళాయి ఏర్పాటు చేస్తామన్నారు. అనంతరం పంచాయతీ ట్యాంకర్ ద్వారా తాగునీటిని సరఫరా చేశారు. అంతేగాకుండా బావిలోని పూడికను తీసేందుకు చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో రవీందర్, ఎంపీవో సంతోష్, పంచాయతీ కార్యదర్శి శ్రీధర్, గ్రామస్థులు కుడిమెత బండు, క్రిష్ణ, గ్రామ పటేల్, తదితరులు పాల్గొన్నారు.

మండలంలోని ప్రతీ గ్రామంలో తాగునీటి ఎద్దడి నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని మండల ప్రత్యేకాధికారి ఫణీంధర్ సూచించారు. తాగునీటి సమస్యపై స్థానిక అధికారులతో ఎంపీడీవో కార్యాలయంలో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి ఆయన మాట్లాడారు. ముఖ్యంగా ఆదివాసీ గిరిజన ప్రాంతాల్లో తాగునీటికి ఇబ్బందులు రాకుండా చూడాలన్నారు. అలాగే అర్హులైన ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని వివరించారు.



నిజాంగూడ గ్రామంలో స్థానికులకు ట్యాంకర్ ద్వారా తాగునీటిని అందిస్తున్న అధికారులు